

తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1632.00	1,608.40
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	15,626	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	15,386	8,909
నీటి నిల్వ (టీఎంసీలు)	101.77	34.53



శివకుమార్‌కు స్వీటు తినిపిస్తున్న ఉద్యోగి

ఉద్యోగుల సంఘం ఎన్నికల్లో

శివ కుమార్‌దే విజయం

సిరుగుప్ప, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సంఘం డైరెక్టర్‌గా శివ కుమార్ విజయం సాధించారు. సిరుగుప్ప తాలుకాలో జరిగిన ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎన్నికల్లో 34 మందికి గాను 23 మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగిలిన 11 మంది దేవేంద్ర గౌడ ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో విద్యాశాఖకు సంబంధించి ప్రత్యర్థి అభ్యర్థి ప్రహల్లాదరావుపై శివకుమార్ ఒక్క ఓటుతో గెలుపొందారు. విద్యాశాఖ సిబ్బంది ఆయన్ని అభినందించారు.

రోడ్లపైనే వరిధాన్యం ఆరబోత

కంప్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రైతులు పొలాల్లో కోసిన వరిధాన్యాన్ని ఆరబోస్తుండంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వారు వాపోతున్నారు. కంప్లి పరిధిలోని రామసాగర గ్రామం వద్ద రోడ్లపైనే వరిధాన్యాన్ని ఆరబోశారు. దీంతో కంప్లి, హొస్పేటకు వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. గతంలో పలుమార్లు ఈ ప్రాంతంలో ప్రమాదాలు కూడా చోటుచేసుకున్నాయన్నారు. రైతులు కలాల్లో ధాన్యాన్ని ఆరబోసుకోవాలని వారు కోరుతున్నారు.



రోడ్డుపై ఆరబోసిన వరి ధాన్యం

ఆయుర్వేద ప్రాధాన్యం చాటిచెప్పాలి: మేయర్

బళ్లారి సిటీ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద వైద్యానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని, దానిని బలోపేతం చేయడంపై దృష్టి పెట్టాలని వైద్యాధికారులకు బళ్లారి మేయర్ ముల్లంగి నందీష్ సూచించారు. నగరంలోని జిల్లా పంచాయతీ హాల్లో మంగళవారం జిల్లా యంత్రాంగం, జిల్లాపంచాయతీ, జిల్లా ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 9వ రాష్ట్రీయ ఆయుర్వేద దినోత్సవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రాచీన కాలం నుంచి ఆయుర్వేదానికి ప్రాధాన్యం ఉందని, ప్రకృతిలో లభించే ఎన్నో మూలికలు మానవుడికి అశేష శక్తినిస్తాయన్నారు. మెరుగైన ఆరోగ్యం కావాలంటే ఆయుర్వేదంలో మరిన్ని ఆవిష్కరణలు జరగాలన్నారు. జిల్లా ఆయుష్ అధికారిణి డాక్టర్ సరళాదేవి మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆయుర్వేదాన్ని సంప్రదాయ వైద్య విధానంగా గుర్తించిదన్నారు. కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ ధన్వంతరి జయంతి సందర్భంగా అక్టోబరు 29, 2016 న రాష్ట్రీయ ఆయుర్వేద దినోత్సవంగా ప్రకటించిందన్నారు. వారం రోజులుగా ఆయుర్వేద ప్రాముఖ్యతను విద్యార్థులకు చాటిచెప్తున్నామన్నారు. జిల్లాలో నాలుగు తాలూకా ఆయుర్వేద ఆసుపత్రులు, 45 ఆయుర్వేద క్లినిక్కులు చురుగ్గా పని చేస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



మొక్కకు నీరుపోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నమేయర్ నందీష్

అనంతరం ధన్వంతరి శ్లోకం ఆలపించి ఆయుర్వేద పితామహుడు ధన్వంతరి చిత్రపటానికి ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లాలోని ఆయుర్వేద ఆసుపత్రుల్లో అత్యుత్తమ సేవలందించిన వారిని సన్మానించారు. ఈసందర్భంగా ఆయుష్ శాఖ విశ్రాంత వైద్యాధికారి డాక్టర్ ఉమేశ్, మాజీ సైనికుడు సుభాష్, డాక్టర్ భారతి సంగం, ఆయుష్ విభాగం వైద్యాధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఉప ఎన్నికల్లో ఏడుగురి నామినేషన్ : కలెక్టర్

బళ్లారి సిటీ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): సండూరు అసెంబ్లీ ఉప ఎన్నిలకు ఏడుగురు అభ్యర్థులు నామినేషన్ వేశారని జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా ప్రకటనలో తెలిపారు. సోమవారం నామినేషన్ పత్రాల పరిశీలనలో ఏడు నామినేషన్లు సక్రమంగా ఉన్నాయన్నారు. నామినేషన్ పత్రాల ఉపసంహరణకు అక్టోబరు 30 చివరి తేది కాగా, నవంబరు 13న ఓటింగ్ నిర్వహించనున్నట్లు మిశ్రా తెలిపారు.



కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా

అక్రమ నిర్మాణాల కూల్చివేత

బళ్లారి సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అక్రమ నిర్మాణాలపై అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. మంగళవారం బాపూజీ నగర్‌లోని ఆర్‌కే మిల్ రోడ్డు ఉదయం నుంచి అక్రమ నిర్మాణాల కూల్చివేత కొనసాగింది. రోడ్డు ఎడమవైపు రెండన్నర నుంచి మూడు అడుగులు, కుడివైపు ఐదు నుంచి ఆరు అడుగుల మేర ఆక్రమించుకుని 50కిపైగా భవనాలు నిర్మించారు. కార్పొరేషన్ అధికారులు ఇటీవల సర్వే చేయించి కొలతు వేశారు. అయినా ఆక్రమణ దారులు ఆలస్యం చేయడంతో అధికారులు కూల్చివేతకు సిద్ధమయ్యారు. ఈసందర్భంలో కార్పొరేషన్ ఈఈలు మల్లనగౌడ, గోవర్ధన్. ఏఈఈలు శ్రీనాథ్, మునాఫ్, పాటిల్, కుమారస్వామి తదితరులు కూల్చివేత కార్యక్రమంలో పాల్గొన్నారు. దీంతో బాపూజీనగర్ ప్రధాన రహదారి నుంచి ఏపీఎంసీ మార్కెట్ వరకు వాహనాల రాకపోకలు సాఫీగా సాగుతాయి.



కూల్చివేతను పరిశీలిస్తున్న అధికారులు

కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

- సండూరు ఉప ఎన్నికల్లో బీజేపీదే విజయం
- మాజీ ఎమ్మెల్యే బైరతి బసవరాజ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బైరతి బసవరాజ్

బళ్లారి సిటీ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): సండూరు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం మాజీఎమ్మెల్యే బైరతి బసవరాజ్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు సండూరు అభ్యర్థి బంగారి హనుమంత అతను మంచి వ్యక్తి అన్నారు. ఈసారి బీజేపీ విజయాన్ని అడ్డుకోవడం ఎవ్వరికీ తగదన్నారు. ఓటర్ల తీర్పే బీజేపీకే అనుకూలం కానుందన్నారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచినా తుకారాం ఎంపీగా గెలిచినా, ఆయన భార్యకే కాంగ్రెస్ టికెట్ ఇవ్వడంపై కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలు భగ్గుమంటున్నారన్నారు. ఇది మా అభ్యర్థి గెలుపుకు దోహదపడుతుంది. చెన్నపట్నం నుంచి యోగీశ్వర్‌ను పార్టీలో నిలుపుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేశారు. అయితే కాంగ్రెస్‌లోకి వెళ్లాలని ముందుగా నిర్ణయించుకున్నట్లే ఆయన వెళ్లారు. అక్కడ ఆయన ప్రభావం ఏమీ ఉందన్నారు. జనార్దనరెడ్డిపై అక్రమ మైనింగ్ అంశం ముఖ్యం కాదు. ఆయన ప్రభావంతమైన నాయకుడు కాబట్టి ప్రచారానికి నాయకత్వం వహిస్తున్నారనడంలో తప్పులేదన్నారు. అభ్యర్థి గెలుపు కోసం శాయశక్తులా కృషి చేస్తున్నామన్నారు. కురబసమాజాం నాకు సంఘంలో మంచి స్థానాన్ని కల్పించింది. అందుకు సంఘం మద్దతు కోరుతున్నానన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు అనిల్‌నాయుడు, నాయకులు కేఏ.రామలింగప్ప, జిహ్వేశ్వరీ రామకృష్ణ, అయ్యాలి తిమ్మప్ప, డాక్టర్ బి.కే.సుందర్ మూర్తి, ఎస్.మల్లనగౌడ, తిప్పన్న,ముదుకుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.

సంరక్షకుల పాత్ర మరువలేనిది

- బిడ్డ ఆరోగ్యంలో వారి పాత్ర కీలకం
- ప్రముఖ వైద్యుడు డాక్టర్ జగదీశ్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ జగదీశ్ తదితరులు

బళ్లారి సిటీ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): బిడ్డ పుట్టిన నాటి నుంచి ప్రతి దశలో సంరక్షకుల పాత్ర ముఖ్యమైనదని, వారి మేలు ఎన్నటికీ మరువలేమని ప్రముఖ వైద్యుడు డాక్టర్ జగదీష్ పేర్కొన్నారు. నగరంలోని బెళగల్ క్రాస్‌లోని విశ్వభారతి కళానికేతన్ విద్యాసంస్థలో మహిళా శిశు అభివృద్ధి శాఖ, దివ్యాంగులు, వయోవృద్ధుల సాధికారత, జిల్లా పునరావాస శాఖ సంయుక్తాశ్రయంలో మంగళవారం నిర్వహించిన ప్రపంచ సంరక్షకుల దినోత్సవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దివ్యాంగుల కోసం పనిచేస్తున్న కేంద్రం, స్వచ్ఛంద సంస్థలు, తాలూకా, గ్రామ స్థాయిలో సంరక్షకుల పాత్రపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమానికి జిల్లా దివ్యాంగుల సంక్షేమ అధికారి గోవిందప్ప అధ్యక్షత వహించి మాట్లాడుతూ మన జీవితంలో ప్రతి దశలో సంరక్షకుల పాత్ర ఎంతో కీలకమన్నారు. సంరక్షకులను గౌరవించడంతో పాటు ముప్పై ఏళ్లలో నిస్సహాయంగా ఉన్నవృద్ధులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రతిభావంతులైన పిల్లల అభివృద్ధికి కృషి చేసిన డాక్టర్ జగదీష్, షేకంబి, లక్ష్మీదేవి,రామలక్ష్మిలను సన్మానించారు. ఈసందర్భంగా జిల్లా పునరావాస కేంద్రం నోడల్ అధికారి నాగేంద్ర, చెంగారెడ్డి, చంద్రశేఖర్, ఉమాపతిగౌడ, భీమవిద్యాసంస్థ అధినేత మహేశ్‌కుమార్, విశ్వభారతి కళానికేతన్ అధినేత గురుమూర్తి, ఉపాధ్యాయులు సోమనాథ్ హిరేమఠ్ తదితరులు పాల్గొన్నారు.

పండగలో పరిశుభ్రత పాటించాలి



స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తున్న నెహ్రూ యువకేంద్రం సభ్యులు

బళ్లారి సిటీ,అక్టోబరు 29: దీపావళి పండుగను ప్రతి ఒక్కరూ పరిశుభ్రతతో జరుపుకోవాలని నెహ్రూ యువజన కేంద్రం జిల్లా యువజన అధికారి మోంటు పత్తర్ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం, నెహ్రూ యువ కేంద్రం సహకారంతో నెహ్రూ యువకేంద్రం ఆవరణలో మంగళవారం నిర్వహించిన స్వచ్ఛ సేవా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్యకరమైన, అందమైన సమాజ నిర్మాణంలో పరిశుభ్రత పాత్ర చాలా ముఖ్యమైనదని, వ్యాపారులు మార్కెట్‌లో పరిశుభ్రత పాటించాలన్నారు. నగరంలోని రాఘవేంద్ర టాకీస్, వడ్డరబండ, ప్రభాత్ టాకీస్ మీదుగా ర్యాలీగా పర్యటిస్తూ పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా న్యూమరాలజీ విభాగం అధికారులు మనీష్‌కుమార్, విమేథ్ విశ్వకర్మ తదితర వలంటీర్లు పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్ కిటకిట

కంప్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వారం మార్కెట్ దీపావళి సందర్భంగా రద్దీగా మారింది. మంగళవారం పలు గ్రామాల నుంచి కొనుగోలు దారులు రావడంతో మార్కెట్ కిటకిటలాడింది. టపాకాయలు, సరుకులు కొనేందుకు దుకాణాల వద్ద సందడి నెలకొంది. వారపు సంత సందర్భంగా పూర్తిగా రద్దీగా మారింది. అలాగే కాయగూరలు కూడా రేట్లు పలికినా వాటిని లెక్కచేయకుండా పండుగ రోజు కావాల్సిన కాయలన్నీ కొనుగోలు చేశారు. గత ఎన్నడూలేని విధంగా వారం మార్కెట్ రద్దీగా మారింది.

తాత్కాలిక వంతెన నిర్మించారు..



హిరేహళ్ళి వద్ద వాగుపై తాత్కాలిక వంతెన నిర్మిస్తున్న గ్రామస్థులు

గంగావతి రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అధికారులు మొర పెట్టుకున్నా సమస్య పరిష్కారం కాకపోవడంతో గ్రామస్థులే రంగంలోకి దిగారు. నిలోగిపుర గ్రామస్తులు తమ గ్రామం నుంచి హిరేహళ్ళికి వెళ్ళే మార్గ మధ్యలో వంతెన నిర్మాణానికి నడుం బిగించారు. కొన్నేళ్లుగా ఈ మార్గంలో నిర్మించిన వంతెన వాగునీటి దాటికి కొట్టుకుని పోయి రాళ్ళు తేలాయి. దీంతో ఈ మార్గం గుండా ఆసుపత్రికి వెళ్ళేవారు, వ్యాపార లావాదేవీలు నిర్వహించే వారు, విద్యార్థులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. వర్షం వస్తే చాలు వాగు ఉధృతంగా ప్రవహించడంతో కొన్ని రోజుల పాటు ఈ మార్గం గుండా రాకపోకలే బంద్ అయ్యేవి. దీంతో విసుగెత్తిపోయిన గ్రామస్థులు ఐకమత్యంగా వాగుపై వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. అధికారులు, నాయకులు స్పందించక పోవడంతో తామే వంతెన నిర్మాణానికి నడుం బిగించినట్లు గ్రామస్థులు తెలిపారు.



అల్లుకుపోతోంది..

తిలకించండి..

- ట్రాన్స్‌ఫార్మర్ దుస్థితిపై చలనం లేని అధికారులు

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దుస్థితిపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు నగరంలో జెస్కాం అధికారులు వ్యవహరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. పలు ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదాలకు దగ్గరలో ఉన్నా వాటిపై దృష్టి పెట్టడం లేదు. ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ పేరుతో వినియోగదారుల నుంచి యూజర్ చార్జీలు వసూలు చేస్తున్నారే కానీ వాటి సంరక్షణ చర్యలను పట్టించుకోవడం లేదు. నగరంలోని మోకారోడ్డులో నక్షత్ర హోటల్ వెనుక వైపు ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌కు తుప్పతీగలు చుట్టు అల్లుకుని ట్రాన్స్‌ఫార్మర్ దుస్థితిలో ఉంది. ప్రతి నెల జంగిల్ కటింగ్ పేరుతో జెస్కాం శాఖ లక్షలాది రూపాయలు డ్రా చేస్తున్నారే మినహా.... విద్యుత్ తీగలపై జంగిల్ కటింగ్ జరగడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ అల్లుకున్న తీగలను తొలగించాలని, వర్షాలు పడితే విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు.

బీజేపీ గెలుపు ఖాయం: మాజీ మంత్రి



ఉబ్బలగండిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీరాములు

కంప్లి/తోరణగల్లు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): సండూరు నియోజకవర్గంలో బంగారు హనుమంతప్ప గెలుపు ఖాయమని మాజీ మంత్రులు శ్రీరాములు, జనార్దన్‌రెడ్డి తెలిపారు. సండూరు ఉప ఎన్నికలు కాంగ్రెస్, బీజేపీ మధ్య పోటా పోటీగా ప్రచారాలు జరుగుతున్నాయి. గెలుపు కోసం నాయకులు పూర్తి స్థాయిలో కృషి చేపడుతున్నారు. మంగళవారం సండూరు నియోజకవర్గంలో మాలాపుర, రాజాపుర, ఉబ్బలగండి, తదితర గ్రామాల్లో జనార్దన్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీరాములు, అభ్యర్థి బంగారు హనుమంతు, కేఎస్ దివాకర్, తిప్పేస్వామి, రామచంద్రరెడ్డి తదితరులు బంగారు హనుమంతప్ప గెలుపు కోసం భారీ స్థాయిలో ప్రచారాలు చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి శ్రీరాములు మాట్లాడుతూ గత నాలుగుసార్లు ఎమ్మెల్యేగా వున్న తుకారామ్ గ్రామాల్లో సరియైన సౌకర్యాలు లేక ఇప్పటికీ తమకు ప్రచారానికి వెళ్లిన సమయంలో సమస్యలను తెలియజేస్తున్నారన్నారు. బీజేపీ పార్టీ హయాంలోనే రాష్ట్రం, కేంద్రంలో అభివృద్ధి వుంది కానీ కాంగ్రెస్ పార్టీలో ఎలాంటి అభివృద్ధి లేదన్నారు. గ్యారెంటీ కార్డు పేరుతో ప్రజలకు మభ్యపెడుతున్నారన్నారు. పంపాపతి, శివరామన్న, వెంకటేష్, ధర్మన్న, నాగరాజు, వన్నూరుస్వామి, హనుమంతు, చంద్రస్వామి, సురేష్, లింగమ్మ, నాగయ్య పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనకు సహకరించాలి

- లోకాయుక్త ఎస్పీ సిద్దరాజు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న లోకాయుక్త ఎస్పీ సిద్దరాజు

కంప్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : సమాజంలో అవినీతి నిర్మూలనకు ప్రతి యువతీ యువకులు, విద్యార్థులు ముందడుగు వేయాలని లోకాయుక్త ఎస్పీ సిద్దరాజు పిలుపునిచ్చారు. మంగళవారం కంప్లి పట్టణంలో డిగ్రీ కళాశాల ఆవరణంలో లోకాయుక్త శాఖ ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులకు తాము పనులు కోసం తామే డబ్బులు లంచం రూపంలో ఇవ్వడం వల్లనే సమాజంలో ఎక్కడ చూసినా అవినీతి పెరుగుతోందన్నారు. ఎక్కడ అవినీతి జరిగినా లోకాయుక్తకు ఫిర్యాదు చేయాలన్నారు. జిల్లాలో పలు చోట్ల ఇప్పటికే జాగృతి కార్యక్రమాలు కూడా చేపడుతున్నామన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో , ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల కోసం వచ్చిన ప్రజలతో తమ సమస్యలను పరిష్కరించి నిజాయితీ అధికారిగా పేరుపొందాలని సూచించారు. తమ చుట్టూ పరిధిలో అధికారులు గానీ నిర్లక్ష్యం వహిస్తే, జరిగే పనులలో నాణ్యత కోల్పోయినా వెంటనే తమకు సమాచారం అందించాలని తెలిపారు. అనంతరం కార్యక్రమంలో అవినీతి నిర్మూలనపై ప్రతిజ్ఞ చేపట్టారు. వీరితో పాటు డీవైఎస్పీ వసంతకుమార్, తహసీల్దార్ శివరాజు, ఈవో శ్రీకుమార్, సీఐ సంగమేష్, మహమ్మద్ రఫీ, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, ఏడీ మల్లన్నగౌడ, తదితరులు విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

అవినీతిని తరిమి కొట్టండి

సిరుగుప్ప : అవినీతిని తరిమి కొట్టండి అని న్యాయవాది వెంకటేష్ నాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం సిరుగుప్ప పట్టణం ప్రభుత్వ గ్రంథాలయంలో అవినీతిని తరిమికొట్టడంపై అవగాహన జాగృతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో అవినీతిని తరిమికొట్టడంపై ప్రమాణ స్వీకారం చేశారు. న్యాయవాది వెంకటేష్ నాయక్ మాట్లాడుతూ దేశంలో ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి పూర్తిగా నశించిన నాడే దేశం మొదటి స్థానంలో వుంటుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పట్టణ ప్రముఖులు రామిరెడ్డి, అబ్దుల్ నబీ, ప్రజలు పాల్గొన్నారు.

హోసూరు జోన్

ఎన్నిలకు సిద్ధం కావాలి : ఎమ్మెల్యే



డీఎంకే మినిట్ పుస్తకాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్

హోసూరు(కృష్ణగిరి) అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): 2026లో వచ్చే శాసనసభ ఎన్నికలకు కార్యకర్తలు, నాయకులు ఇప్పటినుంచే సమాయత్తం కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ పిలుపునిచ్చారని ఎమ్మెల్యే ప్రకాశ్ తెలిపారు. చెన్నై యూనివర్సిటీలో రెండు రోజులక్రితం క్షేత్రస్థాయి సమీక్షపై సన్నాహక సభ జరిగిందన్నారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు నగర యూనియన్ ఏరియా బర్గూరు కార్యదర్శులు రూపొందించిన పార్టీ కార్యక్రమాల మినిట్స్ పుస్తకాలను పరిశీలించి ఆమోదించారన్నారు. సదరు మినిట్స్ పుస్తకాలను బోర్డు ఆఫ్ డైరెక్టర్లు పరిశీలించి, హోసూరు నియోజకవర్గ పరిశీలకుడు వడివేలుకు అందజేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ సత్య, డీఎంకే రాష్ట్ర యూత్ డిప్యూటీ సెక్రటరీ శ్రీనివాసన్, డిప్యూటీ మేయర్ ఆనందయ్య, కార్యదర్శులు రాము, వెంకటేశ్, జిల్లా యూత్ ఆర్గనైజర్ సుమన్, సిటీ యూత్ ఆర్గనైజర్ కలైచెలియన్ పలువురు పాల్గొన్నారు.

కళాశాలలో ఇండోర్ స్టేడియం ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ సరయు



ఇండోర్ స్పోర్ట్స్ భవనం ఇదే...

హోసూరు(కృష్ణగిరి) అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): బర్గూరు ప్రభుత్వ ఇంజనీర్ కళాశాలలో రూ.8.65 కోట్లతో నిర్మించిన ఇండోర్ స్పోర్ట్స్ భవనాన్ని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ వర్చువల్ రూపంలో లాంఛనంగా ప్రారంభించారు. ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో మంగళవారం ఏర్పాటైన కార్యక్రమంలో కృష్ణగిరి కలెక్టర్ సరయు జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పాఠశాల, కళాశాల విద్యార్థులను పాఠాలకే పరిమితం చేయకుండా ఆటపాటల్లో రాణించేలా సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. చదరంగం ఒలింపియాడ్ పోటీలు, జీటో పోటీలు, కత్తిసాము, బ్యాడ్మింటన్ వంటివి జిల్లా, రాష్ట్రస్థాయి ముఖ్యమంత్రి కప్ వంటి పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర మేయర్లు తంబిదురై (నాగోజనహళ్లి), కృష్ణగిరి మున్సిపల్ కౌన్సిల్ డిప్యూటీ చైర్మెన్ సావిత్రి కడలరసుమూర్తి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల నఫీబాబేగం, స్థానిక ప్రజాప్రతినిధులు, కళాశాల విద్యార్థులు హాజరైయ్యారు.

పండుగ ఎఫెక్ట్... ట్రాఫిక్ జామ్

హోసూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ కారణంగా హోసూరు నగర ప్రాంతంలో బాణాసంచా కొనుగోలు చేసేందుకు చుట్టుపక్కల ప్రాంతాలనుంచి ప్రజలు వస్తుండడంతో సాధారణం కంటే ఈసారి భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీపావళి పండుగకు కొత్త దుస్తులు కొనుగోలు చేసేందుకు జనం తరలివచ్చారు. సాధారణ కిరాణ దుకాణాలు, బాణాసంచా, బట్టల షాపులు, మిఠాయిల దుకాణాల వద్ద రద్దీ నెలకొంది. బాగలూరు రోడ్డు, తాలూకా ఆఫీస్‌రోడ్డు, రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారి, డెంకణీకోట రోడ్డు తదితర ప్రాంతాల్లో వాహనసంచారం అధికమై ట్రాఫిక్‌కు అంతరాయం నెలకొంది.




దోశలు వేస్తున్న కిట్టిరెడ్డి

కిట్టీ దోశ..

టేస్ట్ అదుర్స్..!

ఫిదా అవుతున్న నార్పల ప్రజలు


కస్టమర్లకు దోశలు అందజేస్తూ...

ఒక్కోరి చేత్తో ఏ పదార్థం చేసినా టేస్ట్ అదిరిపోతుంది. మామూలు పదార్థాలతోనే చేసినా రుచి మాత్రం వేరే లెవల్లో ఉంటుంది. ఆ కోవకు చెందినదే నార్పలలోని కిట్టిరెడ్డి కిట్టీ దోశ. స్థానిక కార్పొరేషన్ ఎదురుగా ఉన్న ఈ చిన్న హోటల్ ముందు ఉదయమే దోశల కోసం క్యూ కడుతుంటారు. లోపల పదిమంది కూర్చొని తింటూ ఉంటే బయట 20 నుంచి 30 మంది దాకా తమ వంతు కోసం వేచి చూస్తుంటారు. ఇక్కడ సాధారణ పెనం మీద బియ్యం పిండితో వేసిన దోశకు ఎర్ర కారం తగిలించి ఇస్తారు. దాన్ని వేరుశనగ విత్తనాల చెట్నీతో తింటే అద్భుతం అనాల్సిందే. ఒక్కొక్క దోశ పది రూపాయలు మాత్రమే. ధర తక్కువగా ఉండటంతో పాటు రుచి అద్భుతంగా ఉండటంతో కూలి పనులు చేసుకునే వారి నుంచి పోలీసుల వరకు కిట్టిరెడ్డి దోశల కోసం వస్తుంటారు. ఉదయం ఆరు గంటల నుంచి 11 దాకా హోటల్ నిర్వహిస్తారు. ఇక్కడ దోశలతో పాటు ఇడ్లీలు కూడా లభిస్తాయి. రోజుకు కిట్టి రెడ్డి కి రూ.5వేల నుంచి రూ. 7వేల వరకు వ్యాపారం జరుగుతుంది. 20 ఏళ్ల నుంచి నార్పలలో హోటల్ నిర్వహిస్తున్నట్లు కిట్టి రెడ్డి(సంజీవ్‌రెడ్డి) తెలిపారు. నాణ్యమైన, రుచికరమైన దోశలను నార్పల ప్రజలకు అందిస్తున్నట్లు తెలిపారు.

- నార్పల, ఆంధ్రజ్యోతి

సీఎల్ఐఎస్సీ కోర్సులో ప్రవేశాలు

అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పౌర గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో ఐదు నెలల సీఎల్ఐఎస్సీ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ శాఖ డైరెక్టర్ ఎంఆర్ ప్రసన్నకుమార్ మంగళవారం తెలిపారు. విజయవాడలోని వీఎస్ స్కూల్ ఆఫ్ లైబ్రరీ సైన్స్ గుంటూరులోని వావిలాల లైబ్రరీ సైన్స్, కడపలోని రాయలసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లైబ్రరీ సైన్స్ శిక్షణా సంస్థల్లో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో ఒక్కో సంస్థలో 40 చొప్పున మొత్తంగా 240 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నవంబరు 1 నుంచి 15వరకు శిక్షణా సంస్థల్లో దరఖాస్తులు విక్రయిస్తారని, వాటిని నవంబరు 18లోగా పోస్టు చేయాలని వివరించారు. డిసెంబరు నుంచి ఏప్రిల్ 30 వరకు తరగతులు జరుగుతాయని తెలిపారు.

1 నుంచి రెండో దశ అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీఆర్‌సెట్) రెండో దశ అడ్మిషన్లు నవంబరు 1వ తేదీ నుంచి చేపట్టనున్నారు. 2,566 సీట్లకుగాను, తొలి దశలో 2005 సీట్లు భర్తీ చేశారు. మిగిలిన సీట్లను రెండో దశలో భర్తీ చేయనున్నారు. సమగ్ర సమాచారం కోసం.. సెట్స్.ఏపీసీహెచ్‌ఈ.ఏపీ.జీవోవీ వెబ్‌సైట్ చూడాలని కన్వీనర్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు సూచించారు.

చీటింగ్ కేసులో వైసీపీ ఉపసర్పంచ్ అరెస్టు

కదిరి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తలుపుల మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్, వైసీపీ నాయకుడు చింతకుంట క్రిష్టారెడ్డి అలియాస్ డిక్కీబాబును చీటింగ్ కేసులో మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తనకల్లు మండలానికి చెందిన ఓ ఉపాధ్యాయురాలు నాడు-నేడు పనుల్లో అవకతవకల ఆరోపణలతో సస్పెండయ్యారు. డిక్కీబాబు.. సస్పెన్షన్ ఎత్తివేయిస్తానని నమ్మబలికి ఆ ఉపాధ్యాయురాలి వద్ద రూ.8 లక్షలకు ఒప్పందం చేసుకున్నాడు. రూ.ఐదులక్షల నగదు, రూ. రెండు లక్షలకు ప్రాంసరీ నోట్లు రాయించుకున్నాడు. సస్పెన్షన్ ఎత్తివేయించకపోవడంతో ఆ ఉపాధ్యాయురాలు.. డిక్కీబాబును నిలదీసింది. తలుపులలోని తన కార్యాలయానికి వస్తే డబ్బులిస్తానని ఉపాధ్యాయురాలిని పిలిపించుకున్నాడు. అక్కడికెళ్లాక మిగతా రూ.లక్ష ఇవ్వాలనీ, లేకపోతే చంపుతానని కత్తితో బెదిరించాడు. దీనిపై ఉపాధ్యాయురాలు.. పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ మేరకు తలుపుల పోలీసులు కేసు నమోదు చేశారు. డిక్కీబాబును తలుపులలోని ఆంజనేయస్వామి గుట్టవద్ద అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.రెండులక్షల నగదు, రెండు ప్రాంసరీ నోట్లు, కత్తి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పలు కేసుల్లో నిందితుడు..


క్రిష్టారెడ్డి అలియాస్ డిక్కీబాబుపై ఆరు కేసులు నమోదయ్యాయి. రౌడీషీట్ కూడా ఉంది. ఉద్యోగులను బెదిరించడం, ఎస్సీ ఎస్టీలపై దౌర్జన్యం కేసులు నమోదయ్యాయి. రైస్‌పులింగ్ పేరుతో అనేక మందిని మోసం చేసినట్లు కేసులున్నాయి.


ధ్వంసమైన పతిమల తూము కాలువ

- ధ్వంసమైన శ్రీరంగరాయలచెరువు కాలువలు
- పెరిగిపోయిన కంపచెట్లు, జనుము
- ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని వైనం
- బీడుగా మారిన ఆయకట్టు భూములు


కాలువలో పెరిగిన జనుము

శ్రీరంగ రంగా..!


ధ్వంసమైన పెద్దకాలువ తూము

శింగనమల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోకపోవంతో శింగనమల శ్రీరంగరాయలచెరువు కింద కాలువలు ధ్వంసమయ్యాయి. కాలువల పొడువునా కంపచెట్లు, జనుము పెరిగిపోయింది. జిల్లాలో అతిపెద్ద చెరువుగా ఉన్న శ్రీరంగరాయలచెరువు కింద 2,500 ఎకరాలు ఆయకట్టు ఉంది. ఈ భూమికి నాలుగు కాలువల ద్వారా నీరు సరఫరా అవుతుంది. గత పదేళ్లుగా చెరువులో సమృద్ధిగా నీరు ఉన్నా ఒక తూము కింద ఆయకట్టు భూములకే సరఫరా అవుతోంది. ఆ ఆయకట్టు రైతులు మాత్రమే పంటలు సాగు చేస్తున్నారు. ఇక చిన్నకాలువ, పెద్దకాలువ పతిమల కాలువ కింద ఉన్న చివరి ఆయకట్టు వరకు నీరు పారడం లేదు. ఎక్కడపడితే అక్కడ కాలువలు ధ్వంసం కావడం, కంపచెట్లు జనుము పెరిగిపోవడమే ఇందుకు ప్రధాన కారణం. వీటిని తొలగించడానికి ప్రతి ఏటా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత పదేళ్ల నుంచి పతిమల తూము కింద పంట సాగు చేసిన దాఖలాలే లేవు. దానితో కాలువ పొడువునా ఆయకట్టు భూముల్లో కంపచెట్లు పెరిగి అడవిని తలపిస్తోంది. ఈ కాలువలకు 20 సంవత్సరాలు కిందట మరమ్మతులు చేసిన ట్లు సమాచారం. గత ప్రభుత్వంలో ఎవరిని అడిగినా ప్రయోజనం లేకుండా పోయిందని, కూటమి ప్రభుత్వమైనా చర్యలు తీసుకుని కాలువకు మరమ్మతులు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. ఇందుకు ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పదేళ్ల నుంచి బీడుగానే ఉంచాం..



మాకు పతిమల తూము కింద చివరిలో భూమి ఉంది. పదేళ్ల కిందట పంట సాగు చేసేవాళ్లం. మా భూమి ఆయకట్టుకు చివరిగా ఉండటం, కాలువ పొడవునా కంపచెట్లు, జనుము పెరగడం, కాలువకు ఉన్న రాళ్ల ధ్వంసం కావడంతో నీరు రావడం లేదు. దీంతో పదేళ్లుగా బీడుగా ఉంచాం.

- లక్ష్మన్న, గోవిందరాయునిపేట, రైతు

ఇబ్బంది పడాల్సిందే



మాకు పెద్ద కాలువ కింద భూమి ఉంది. ఈకాలువ కింద పంటలు సాగు చేస్తే నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సిందే. కాలువ ఎక్కడ చూసినా ధ్వంసం కావడంతో నీరు మెట్ట భూముల్లోనే ఆగిపోతోంది. పదేళ్ల కిందట పంట సాగు చేశాం. అప్పుడు పై రైతులతో గొడవ పడి నీరు తీసుకొచ్చాం. ఇప్పుడు గొడవలు పడే ఓపిక లేదు. అందుకే అప్పటి నుంచి పంట సాగు చేయలేదు. గండ్లు లేకుండా కాలువకు మరమ్మతులు చేయాలి. అప్పడే పంట సాగు చేస్తాం.

- నాగేంద్ర, గోవిందరాయునిపేట రైతు

ఎమ్మెల్యే చొరవ చూపాలి..



చెరువు కింద నాలుగు తూముల కాలువలు వెంటనే మరమ్మతులు చేయాలి. అపుడే అన్ని కాలువల ద్వారా ఆయకట్టుకు నీరు చేరుతుంది. లేకపోతే కాలువ మొదటి భూములల్లోనే వృథాగా పోతుంది. ఎమ్మెల్యే బండారు శ్రావణి చొరవ చూపి మరమ్మతులకు నిధులు తీసుకు రావాలి.

- శ్రీరాములు, రైతు, పోతురాజుకాల్వ

ఎన్నిసార్లు తెలిపినా ప్రయోజనం లేదు



చెరువు కింద కాలువలను మరమ్మతు చేయకపోతే చివరి ఆయకట్టు భూములకు నీరు చేరడం కష్టమని గత పదేళ్ల నుంచి అధికారులకు ఎన్నిసార్లు తెలిపిన ప్రయోజనం లేదు. పాలకులు దృష్టి సారించి కాలువ మరమ్మతు పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి.

- డి.చిన్నప్పయాదవ్, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

ప్రతిపాదనలు పంపాం: సాయినాథ్, ఇరిగేషన్ జేఈ

శింగనమల చెరువు నాలుగు తూముల కింద ఉన్న కాలువల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం.

మహిళలదే ఆధిక్యం

- పురుషుల కంటే అధికంగా 23,412మంది మహిళా ఓటర్లు
- జిల్లాలో మొత్తం ఓటర్లు 20,20,441
- అనంత అర్బన్‌లో అత్యధికం...
- ఉరవకొండ అత్యల్పం
- జిల్లా ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల


ముసాయిదా జాబితాను విడుదల చేస్తున్న కలెక్టర్

అనంతపురం టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లా ఓటర్ల ముసాయిదా జాబితాను కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ మంగళవారం విడుదల చేశారు. కలెక్టరు మాట్లాడుతూ ఎస్ఎస్ఆర్ 2025లో భాగంగా జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాలలో కలిపి 20,20,441మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఇందులో పురుష ఓటర్లు 9,98,764మంది ఉండగా, మహిళా ఓటర్లు 10,21,412మంది ఉన్నారన్నారు. అలాగే థర్డ్‌జెండర్స్ఓటర్లు 245మంది ఉన్నట్లు వెల్లడించారు. ఇందులో అత్యధికంగా అనంతపురం అర్బన్‌నియోజకవర్గంలో 2,81,757మంది ఓటర్లు ఉండగా అత్యల్పంగా ఉరవకొండ నియోజకవర్గంలో 2,24,635మంది ఓటర్లు ఉన్నారని కలెక్టరు తెలిపారు. ఈజిల్లా ఓటర్లలో పురుషులు కంటే 23,412మంది మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారని వెల్లడించారు. రాయదుర్గం నియోజకవర్గంలో 296, ఉరవకొండలో 260, గుంతకల్లులో 276, తాడిపత్రిలో 274, శింగనమలలో 293, అనంతపురం అర్బన్‌లో 285, కళ్యాణదుర్గంలో 261, రాప్తాడులో 281 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. ఈజాబితాను అన్ని నియోజకవర్గాలకు పంపుతామన్నారు. పరిశీలన అనంతరం వచ్చే ఏడాది జనవరి 6న ఓటర్ల తుది జాబితాను ప్రకటిస్తామని కలెక్టరు వెల్లడించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ మలోల, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరి, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ కనక రాజు, ఈడీటీలు సుజాత, వరప్రసాద్, సువర్ణ, రామకృష్ణ, హబీబా, ఐటీ ప్రోగ్రామ్ ఇంజనీర్ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గం	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	థర్డ్‌జెండర్స్	మొత్తం ఓటర్లు
రాయదుర్గం	1,30,558	1,33,409	42	2,64,009
ఉరవకొండ	1,10,702	1,13,905	28	2,24,635
గుంతకల్	1,33,021	1,37,804	74	2,70,899
తాడిపత్రి	1,23,513	1,25,509	25	2,49,047
శింగనమల	1,23,266	1,24,682	29	2,47,977
అనంతపురంఅర్బన్	1,37,943	1,43,786	28	2,81,757
కళ్యాణదుర్గం	1,14,603	1,16,639	05	2,31,249
రాప్తాడు	1,25,178	1,25,678	12	2,50,868

కలెక్టర్ కంటే ముందే..

- జిరాక్స్ సెంటర్ వద్ద ఓటర్ల ముసాయిదా జాబితా

అనంతపురం టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రహస్యంగా ఉండాల్సిన ఓటర్ల జాబితా అధికారికంగా విడుదల కాకముందే జిల్లా కేంద్రంలోని జిరాక్స్ సెంటర్ల వద్ద మంగళవారం కనిపించింది. ఓటర్ల ముసాయిదా జాబితా-2025ను కలెక్టరు వినోద్‌కుమార్ మంగళవారం విడుదల చేశారు. ఈఓటర్ల జాబితాను భద్రతా నియమాలు పాటిస్తూ ముద్రించి, అంతే భద్రంగా కలెక్టరేట్‌కు చేర్చాలి. అక్కడ విడుదల చేసిన తర్వాత సంబంధిత శాఖల అధికారుల ద్వారా ప్రజాప్రతినిధులకు అందించాలి. ఇందుకోసం ప్రత్యేకంగా టెండర్ ఇస్తారు. ఆ టెండర్‌దారుడు నిబంధనల మేరకు జాబితా ముద్రణ చేసి ఇవ్వాల్సి ఉంటుంది. అలాకాకుండా టెండర్‌దారుడు జిరాక్స్ సెంటర్లకు ఇచ్చి అక్కడ ఈ ఓటర్ల జాబితాను ప్రింట్ చేయించాడు. అక్కడ కలెక్టరు జాబితాను విడుదల చేయకనే నడిరోడ్డులో ఉన్న జిరాక్స్‌సెంటర్లవద్ద ఈఓటర్ల జాబితా బండిల్స్ దర్శనమిచ్చాయి. జిరాక్స్ సెంటర్ల వద్ద రోడ్డున ఈబండిల్స్ పడేయడం చూసిన జనం ఫొటోలు తీసి కలెక్టరుకు పంపారు. మరి నిర్లక్ష్యం వహించిన అధికారులు, టెండర్‌దారుడిపై జిల్లా కలెక్టరు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే



సాయినగర్‌లోని జిరాక్స్ సెంటర్‌వద్ద ఓటర్ల జాబితా కాపీల బండిళ్లు

క్రీడా పోటీలు ప్రారంభం


ప్రభుత్వ ఉద్యోగుల క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల క్రీడా పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో పోటీలను ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి ప్రారంభించా రు. క్యారమ్స్, చెస్ ఆడిన ఐసీడీఎస్ ఉద్యోగులను ఆమె ప్రోత్సహించారు. అశోక్‌నగర్ డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, కబడ్డీ, యోగా, చెస్, టేబుల్‌టెన్నిస్, క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. నీలం సంజీవరెడ్డి పీటీసీ మైదానంలో క్రికెట్, ఫుట్‌బాల్, ఖో ఖో, అథ్లెటిక్, హాకీ, వాలీబాల్, రెజ్లింగ్, వెయిట్‌లిఫ్టింగ్, బెస్ ఫిజిక్, పవర్‌లిఫ్టింగ్ పోటీలు జరిగాయి. మొత్తం 200మందికి పైగా ఉద్యోగులు పోటీల్లో పాల్గొన్నారు. బుధవారం ప్రసన్నాయపల్లి సమీపంలో స్విమ్మింగ్(ఈత) పోటీలు, ఆర్డీటీ స్టేడియంలో లాన్‌టెన్నిస్ పోటీలు ఉంటాయని డీఎస్‌డీఓ షఫీ తెలిపారు. జిల్లా స్థాయిలో విజేతలైన క్రీడాకారులు నవంబరు ఆరు నుంచి 9వతేదీ వరకు విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో శాప్ కోచ్‌లు నరేష్, రాఘవేంద్ర, వంశీ, అనిల్‌కుమార్, లక్ష్మి, జెబీవుల్లా, అలీ, మంజుళ, దేవమణి, సుచీంద్ర తదితరులు పాల్గొన్నారు.

రచనలకు ఆహ్వానం

అనంతపురం కల్చరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో రాయలసీమ నాటక రచనా పోటీలకు రచనలను ఆహ్వానిస్తున్నట్లు ఆ వేదిక సమన్వయకర్త డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. 'రాయలసీమ సమాజం - జీవన సంస్కృతి' నేపథ్యంగా ఏకాంకిక, నాటిక, నాటక రచనలు పంపాల్సి ఉంటుందన్నారు. గెలుపొందిన రచయితలకు రూ.15వేలు అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన రచయితలు డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి, డోర్ నెం. 1-1349, ప్లాట్ నెం.24, మైస్ విలాస్, టాటా షోరూమ్ వద్ద, నేషనల్ హైవే, రుద్రంపేట, అనంతపురం - 515 002 చిరునామాకు డిసెంబరు 22లోపు తమ రచనలను పంపాలన్నారు. వివరాలకు 99639 17187 నెంబర్‌ను సంప్రదించవచ్చునన్నారు.

కేంద్ర పథకాలు పక్కాగా అమలు కావాలి



జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు

ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను పక్కాగా అమలు చేయాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని.. ప్రజల సమస్యలను ప్రస్తావించారు. వాటిని పరిష్కరించాలని కోరారు. వీటిపై ఎంపీ స్పందించారు. కేంద్రం ఇచ్చిన నిధులను సకాలంలో ఖర్చు చేయాలని, లేదంటే వెనక్కి పోతాయని అన్నారు. ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇళ్ల నిర్మాణం, విద్యా సంస్థలతో మధ్యాహ్న భోజనం, ఆస్పత్రులలో మెరుగైన వైద్యం తదితర అంశాలపై సూచనలు ఇచ్చారు. ఉద్యాన పంట దిగుబడుల తరలింపునకు జిల్లా నుంచి కిసాన్ రైలు నడపాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరామని తెలిపారు. జిల్లా ఆస్పత్రిలో మహిళల విశ్రాంతి భవనం కోసం నిధులు ఇస్తానని, వెంటనే స్థలాన్ని చూసి పనులు ప్రారంభించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని అధికారులకు కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సూచించారు. పంట నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర బృందం జిల్లాకు వస్తోందని, అవసరమైన సమాచారాన్ని సేకరించి పెట్టుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. క్రిటికల్, ట్రామాకేర్ సెంటర్లకు నిధులు అవసరమని, కేంద్రం దృష్టికి తీసుకువెళ్లి మంజూరు చేయించాలని ప్రజా ప్రతినిధులను కలెక్టర్ కోరారు. జిల్లాలో జనరిక్ మందుల దుకాణాల గురించి సరైన సమాచారం ఇవ్వని ఆ శాఖ అధికారులపై ఎంపీ, కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాజకీయ జోక్యంపై..

జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, ఎంపీ అంబికా మధ్య ఆసక్తికర సంవాదం జరిగింది. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో రాజకీయ జోక్యం కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎమ్మెల్సీ అన్నారు. దీంతో 'మీ ప్రభుత్వంలో రాజకీయ జోక్యం అధికంగా ఉండేది కదా..?' అని ఎంపీ ప్రశ్నించారు. 'మా ప్రభుత్వంలో రాజకీయ జోక్యం లేదని చెప్పడం లేదు. ఇప్పుడు అలా జరగకుండా చూడండి. ప్రజలకు న్యాయం జరిగేలా చూడండి' అని ఎమ్మెల్సీ అన్నారు. సమావేశంలో జడ్పీ ఛైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీమ్, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, జడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈ పండగకైనా

ఇస్తారా..?



- జీతం కోసం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఎదురుచూపు
- ఏడు నెలలుగా పీఆర్ క్యూసీ ఉద్యోగులకు పెండింగ్
- కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు

అనంతపురం సిటీ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పంచాయతీ రాజ్ శాఖ పరిధిలోని క్వాలిటీ కంట్రోల్ (క్యూసీ) విభాగంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు జీతాల కోసం ఎదురు చూస్తున్నారు. ఏడు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో వెలుగుల పండుగ(దీపావళి)పూట కూడా తమకు చీకట్లేనా అని వారు నిట్టూరుస్తున్నారు. వాస్తవంగా ప్రతి ఏడాది మార్చి, ఏప్రిల్ నెలలో ప్రతి ఏడాదికి సంబంధించి సుమారు రూ.67 లక్షలు వరకు ఏ ప్రభుత్వమైనా మంజూరు చేసేది. దీంతో ఏడాదిపాటు సకాలంలో జీతభత్యాలు ఇవ్వడంతో పాటు శాఖాపరంగా సంబంధిత పనులు కూడా వెంటనే జరిగిపోయేవి. అయితే గత సర్కార్ ఈ నిధుల మంజూరులో జాప్యం చేయడంతో ఉద్యోగులకు జీతాలు అందడం లేదు. దీంతో కుటుంబపోషణ కష్టంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వమైనా స్పందించి తగిన నిధులను వెంటనే మంజూరు చేసి న్యాయం చేయాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కోరుతున్నారు.

ఏడు నెలలుగా అందని జీతాలు


క్యూసీ విభాగంలో పనిచేస్తున్న 15మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఈ ఏడాది ఏప్రిల్ నెల నుంచి ఇప్పటి వరకు జీతాలు రాలేదు. ఒక్కొక్కరికి నెలకు రూ.19 వేలు చెప్పున ఏడు నెలలకు రూ. 1.33లక్షలు రావాల్సి ఉంది. మొత్తంగా 15మందికి మొత్తం రూ. 20 లక్షలు వరకు రావాల్సి ఉంది. జీతాల గురించి పలుమార్లు అడిగినా ఫలితం లేదు. వీరిలో ముగ్గురు ఉద్యోగులు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు ఆశాఖ వర్గాల నుంచి తెలిసింది. ప్రభుత్వం మంజూరు చేసే నిధుల్లో జీతాలు పోగా మిగిలిన నిధులతో శాఖ పనులతో పాటు ల్యాబ్ పరీక్షలు, ఇతర సామగ్రి, వాహనాల అద్దెలకు సంబంధించి వినియోగించేవారు. కానీ గత సర్కార్ ముందస్తుగా నిధులను విడుదల చేయకపోవడంతోనే సమస్యలు ఏర్పడుతున్నాయి. నిధులేమైనా ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందా అంటే అదీ లేదు. ఆయా జిల్లాల వారిగా ఎక్కడికక్కడ క్యూసీ హెడ్ అకౌంట్‌కు ఆయా పనుల ద్వారా కొంత శాతం నగదు జమ అవుతూనే ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వంతో పాటు ఆశాఖ ఉన్నతాధికారుల మంజూరుకు అనుమతి ఇస్తే.. చాలు వెంటనే ఆయా జిల్లాల ఈఈలుగా సదరు అకౌంట్ నుంచి ఏ నెలకు ఎంత అమౌంట్ కావాలో.. డ్రా చేసుకుని జీతభత్యాలతో పాటు ఇతర పనులకు వినియోగించు కునే అవకాశం ఉండేదీ. ఒకసారి అనుమతిస్తే ఏడాది పాటు ఎలాంటి సమస్య ఉండేదీ కాదు. కానీ గత సర్కార్ ఎన్నికల హడావుడిలో పడి ఈ నిధులను మంజూరు చేయకుండా గాలికి వదిలేసింది. దీంతో అప్పటి నుంచి వీరికి ఇబ్బందులు తప్పడం లేదు.

ల్యాబ్ పరీక్షలు, సామగ్రి నిధులదీ అదే దుస్థితి

ల్యాబ్ పరీక్షలు, ఇతర సామగ్రి కొనుగోలు, అద్దె వాహనాల బిల్లులు తదితర వాటికి సంబంధించిన నిధులు కూడా ఏడు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో పనులు కూడా అంతంతమాత్రంగానే జరుగుతున్నాయి. ప్రధానంగా అద్దె వాహనాల బిల్లులు మంజూరు చేయకపోవడంతో అధికారుల పరిస్థితి కూడా ఇబ్బందికరంగా మారింది. కూటమి ప్రభుత్వమైనా స్పందించి నిధుల మంజూరుకు అనుమతించి జీతాలు వచ్చేలా చూడాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పాటు పీఆర్ శాఖ యంత్రాంగం కోరుకుంటోంది.


క్వాలిటీ కంట్రోల్ కార్యాలయం

ప్రభుత్వానికి నివేదించాం



వేతన బకాయిలు, ఇతర నిధుల విషయంపై ప్రభుత్వానికి నివేదించాం. ఈ ఏడాది ఏప్రిల్ నెలలోనే అనుమతి రావాల్సి ఉంది. తరచూ అడుగుతూనే ఉన్నాం. అనుమతి రాగానే నగదు డ్రా చేసి ఉద్యోగులకు జీతాలను అందజేస్తాం. క్యూసీ పనుల్లో ఎలాంటి ఆలస్యం లేకుండా చూస్తాం.

- మల్లికార్జున మూర్తి, క్యూసీ ఈఈ


ఆస్పత్రి నమూనాను పరిశీలిస్తున్న ప్రధాని మోదీ



ఎస్సీ వర్గీకరణకు త్వరలో
ఏకసభ్య కమిషన్

● ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ వివరాలు సేకరించేందుకు త్వరలో ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేస్తామని సీఎం సిద్దరామయ్య తెలిపారు. బెంగళూరులో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సోమవారం కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయంపై కొందరు ఉద్యోగార్థులు సందేహాలను వెలిబుచ్చారన్నారు. ఎస్సీ వర్గీకరణ జరపాలని మంత్రివర్గంలో నిర్ణయం తీసుకున్నామన్నారు. రిజర్వేషన్ల కేటాయింపు, సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించడంతోపాటు ఇతర విషయాలను సమగ్రంగా పరిశీలించి అనుకూలమయ్యేలా నిర్ణయం తీసుకుంటామన్నారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో కమిషన్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ కమిషన్ మూడు నెలల్లో నివేదిక ఇవ్వనుందన్నారు. రాష్ట్రంలో సివిల్ సేవలు రిజర్వేషన్‌లకు అన్వయించేలా నేరుగా నియామకాలను జరిపేందుకు కొత్తగా గెజిట్ జారీ చేయకూడదని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఎటువంటి ప్రయోగాత్మకమైన డేటా లేదని కొందరు అభిప్రాయపడ్డారన్నారు. ఎస్సీలోని ఉపజాతులను పరిగణించాలన్నదే ప్రభుత్వ విధానమన్నారు. ఉద్యోగాలను ఆశిస్తున్నవారిలో కొంతమేర గందరగోళం నెలకొందని, అందుకే స్పష్టత ఇవ్వదలిచామన్నారు.

నేడు దర్శన్ బెయిల్ పిటిషన్‌పై తీర్పు

బెంగళూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ రేణుకాస్వామి హత్య కేసులో రెండో నిందితుడిగా ఉన్న సినీ నటుడు దర్శన్ బెయిల్ పిటిషన్‌పై మంగళవారం విచారణ ముగిసింది. తీర్పును బుధవారం ప్రకటిస్తామని హైకోర్టు న్యాయమూర్తి ఎస్ విశ్వజిత్‌శెట్టి ఏకసభ్య ధర్మాసనం వెల్లడించింది. విచారణ వేళ దర్శన్ తరపున సీవీ నాగేశ్ వాదనలు వినిపించారు. దర్శన్‌కు రెండేళ్లుగా వెన్నునొప్పి ఉందని ఇటీవల తీవ్రమైందని చికిత్స జరిపించకపోతే కిడ్నీ సమస్య తలెత్తవచ్చునని లేదా పక్షవాతానికి అవకాశాలు ఉంటుందనే వైద్యుల అభిప్రాయాన్ని తెలిపారు. మైసూరు అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందేందుకు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ఇందుకు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రసన్నకుమార్ అభ్యంతరం వ్యక్తం చేశారు. పిటిషనర్ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతానని కోరడం సమంజసం కాదన్నారు. అయితే బుధవారం ఏం జరుగనుందనేది దర్శన్ అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది.


చిక్కమగళూరు జిల్లాలో ఓ కొండ పచ్చదనం

పర్యాటకులను ఆకర్షించడమే
లక్ష్యం..!

● కొత్త విధానాలకు ప్రభుత్వం సన్నాహాలు
● 25 విభాగాల్లో 44 పథకాలు
● 48 కోట్లమందిని ఆకర్షించడమే ధ్యేయం
● చిక్కమగళూరుపై ప్రత్యేక దృష్టి


ఆకర్షణగా కుద్రేముఖ ప్రాంతం

బెంగళూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): శాస్త్ర సాంకేతిక రంగాల్లో విజయం ద్వారా ప్రపంచమంతా గుర్తింపు పొందిన కర్ణాటకను పర్యాటక రంగంలోనూ అగ్రస్థానంలో ఉంచాలని ప్రభుత్వం భావిస్తోంది. పర్యాటకులను ఆకర్షించేలా పలు ప్రత్యేక పాలసీలు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్లకు సంబంధించి సరికొత్త పాలసీని అమలు చేయనుంది. ఏటా 48 కోట్లమంది దేశీయ, కనీసం 20లక్షలమంది విదేశీ పర్యాటకులను ఆకర్షించేదిశగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. దేశంలోనే అత్యధిక పర్యాటకులు సందర్శించే తొలి మూడు రాష్ట్రాల్లో ఒకటిగా కర్ణాటకను తీర్చిదిద్దనున్నారు. కొత్త పాలసీ లక్ష్యం ప్రకారం కనీసం 47వేలమందికి నేరుగా ఉద్యోగాలు, లక్షమందికి పరోక్షంగా ఉపాధి కల్పించాలని భావిస్తున్నారు. పర్యాటకశాఖ ద్వారా 7,800 కోట్ల రూపాయల పెట్టుబడులు ఆకర్షించడం కొత్త పాలసీల్లో ప్రధానలక్ష్యంగా ఉంది. పర్యాటక రంగ అభివృద్ధికి మొత్తం 25 విభాగాల్లో 44 పథకాలను రూపొందించదలిచారు. సుస్థిర పర్యాటక అభివృద్ధికి అనుకూలమైన వాతావరణం కల్పించడం ఉత్తమమైన పర్యాటక సౌలభ్యాలు కల్పించదలిచారు. ప్రతి జిల్లాకు ఒక ప్రత్యేక పర్యాటక కేంద్రాన్ని అభివృద్ధి చేయడం ద్వారా 30 ప్రముఖ పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేయనున్నారు. విద్యార్థులకు ఎడ్యుకేషన్ టూర్, రైతులకు అగ్రికలర్ టూర్, ఆరోగ్య, ఆధ్యాత్మిక, తీర్థయాత్రలతోపాటు చారిత్రాత్మక కట్టడాల సందర్శన, అధ్యయన పర్యాటకం, సాహస పర్యాటకం, విరామం, వినోదం, జ్ఞానార్జన, విశ్రాంతి, మనశ్శాంతి వంటి విభాగాల్లో ఆకర్షించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. రాష్ట్ర జీడీపీకి పర్యాటక రంగం ద్వారా కూడా ఆర్థికంగా బలపడే విధంగా పాలసీని రూపొందిస్తున్నారు. పర్యాటక కార్యకలాపాలకు సామాన్య ప్రజలు, స్థానికులు ప్రతిఫలం పొందడంతోపాటు యునెస్కో గుర్తింపు పొందేందుకు ఎక్కువ చారిత్రాత్మక ప్రాంతాలను చేర్పించేందుకు కృషి చేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటకశాఖ పర్యవేక్షణలో ఉండే 680 ఎకరాల భూమిని అదే విభాగానికి కేటాయించనున్నారు. ప్రాజెక్టుల కోసం అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేసుకోదలిచారు. పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్‌ను (పీపీపీ) పెంపొందింపచేయడం, పెట్టుబడులకు స్నేహపూరితమైన పాలసీలు ఉండేలా రూపొందించదలిచారు. వాణిజ్య వాతావరణం పెంపొందింపచేసేందుకు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఉత్తేజితం చేసే అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని భావిస్తున్నారు. ఆతిథ్యం కల్పించే విభాగాలలో పెట్టుబడులకు ముందుకొచ్చేవారికి ఐదు శాతం రాయితీ కల్పించదలిచారు. 9 ప్రోత్సాహకమైన చర్యలు, పలు సబ్సిడీలు, రాయితీలు కల్పించదలిచారు.

బీచ్‌లపై ప్రత్యేక దృష్టి

చిక్కమగళూరు జిల్లా పరిధిలో అడ్వెంచర్‌లు చేసేందుకు పలు కేంద్రాలు ఉన్నాయి. వీటితోపాటు రాష్ట్రంలో వ్యవసాయ, ఉద్యాన, విశ్వవిద్యాలయాలు, హెసరఘట్టలోని ఉద్యాన పరిశోధనా కేంద్రాలు ఉన్నాయి. ఏటా కొత్త వంగడాలు, ఆధునిక సాగు విధానాలపై పరిశోధనలు జరుగుతుంటాయి. వాటిని రైతులు, యువత, విద్యార్థులకు అవసరం కల్పించేందుకు చర్యలు తీసుకోదలిచారు. రాష్ట్రానికి అనుబంధంగా ఉండే గోవా ప్రపంచంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా ఉంది. ఇక్కడికి విదేశీయులు ఏటా లక్షలాదిమంది పైగా వస్తుంటారు. ఉత్తర కన్నడ, ఉడుపి, దక్షిణకన్నడ జిల్లాల్లోని సముద్రతీరం గోవా తరహాలోనే ఉంటుంది. అందుకే దేశ విదేశీయులను ఆకర్షించేందుకు పలు బీచ్‌లను అభివృద్ధి చేయనున్నారు. బళ్ళారి, మైసూరు, హాసన్ ప్రాంతాలు సాంస్కృతిక పర్యాటకానికి అనుకూలంగా ఉన్నాయి. ప్రకృతి వన్యజీవి కేంద్రాలకు రాష్ట్రంలో కొదవలేదు. పదులసంఖ్యలో అభయారణ్యాలు ఉన్నాయి. ఆధ్యాత్మిక పర్యాటకంలో భాగంగా పలు ప్రాంతాలను ఎంపిక చేయదలిచారు. రాష్ట్రంలోనే అత్యధిక మెడికల్ కళాశాలలు, ఆసుపత్రులు ఉన్నాయి. విదేశీయులు సైతం ఇక్కడికి చికిత్స పొందేందుకు వస్తుంటారు. మరింతమంది విదేశీయులను ఆకర్షించదలిచారు. 25 విభాగాలలో పర్యాటకరంగాన్ని అభివృద్ధి చేయదలిచారు. ఇందుకు సంబంధించి కేబినెట్ భేటీలో తీర్మానించారు.

రిమ్స్‌లో ఐసీయూకు
ప్రధాని శంకుస్థాపన

●వర్చువల్‌గా హాజరైన నరేంద్ర మోదీ

రాయచూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో నూతనంగా నిర్మిస్తున్న ఇంటెన్సివ్ కేర్ ఇట్ యూనిట్ పనులకు మంగళవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. రూ.21.85 కోట్లతో నిర్మించనున్న ఈ ఐసీయూ యూనిట్‌కు కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులు ఇస్తుండగా మిగితా 40 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేయనుంది. పనులను వర్చువల్‌గా శంకుస్థాపన పనులకు చేపట్టిన ప్రధాని, ప్రజా ఆరోగ్యానికి తమ ప్రభుత్వం తొలి ప్రాధాన్యం ఇస్తుందని పేర్కొన్నారు. ఏ రాష్ట్రానికైనా వైద్యసాయం అందించేందుకు ముందుంటామన్నారు. కార్యక్రమానికి సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటీల్, నగరసభ అధ్యక్షురాలు, రిమ్స్ ఆస్పత్రి డైరెక్టర్, డీహెచ్ఓ తదితరులు హాజరైయ్యారు.

అభివృద్ధికి కదలిరండి..

● దత్తతకు బెంగళూరు పార్కులు, సర్కిళ్లు
● మరోసారి మహానగర పాలికె ప్రత్యేక కార్యక్రమం


కబ్బన్ పార్క్ ప్రధానద్వారం

బెంగళూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నగరంలో ఉద్యానవనాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం ప్రారంభించింది. ప్రైవేట్ భాగస్వామ్యంతో వాటిని మరింత అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. బెంగళూరు నగర ప్రజలకు మహానగర పాలికె సరికొత్త ఆఫర్‌ను ప్రకటించింది. నగర పరిధిలోని ప్రముఖ పార్కులు, వివిధ స్థలాలు, కూడళ్లను దత్తత ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. గతంలోనూ ఇటువంటి ఆఫర్‌ను ఇచ్చారు. ప్రస్తుతం నగర పరిధిలో 1280 పార్కులు, సర్కిళ్లను పాలికె అభివృద్ధి చేసి పర్యవేక్షిస్తోంది. పాలికె పరిధిలోని పార్కులు, సర్కిళ్లను 'నమ్మ బెంగళూరు - నా సహకారం' పేరిట సీఎస్ఆర్‌లో భాగంగా దత్తత పొందేందుకు ఆహ్వానించారు. బీబీఎంపీ పరిధిలో వారు ఎంపిక చేసుకున్న పార్కులు, సర్కిళ్లను అభివృద్ధి చేయడంతోపాటు పర్యవేక్షించే బాధ్యత అప్పగిస్తారు. తొలి విడతలో 6 సంస్థలకు పార్కులు, సర్కిళ్లను దత్తత ఇచ్చారు. ప్రస్తుతం మరోసారి ఆహ్వానించారు. నవంబరు 15లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కమ్యూనిటీ ఇన్వాల్వ్‌మెంట్ ఫర్ పార్క్ కన్సర్వేషన్ పాలసీ (సీఐపీసీ) 2024 సీఎస్ఆర్‌లో భాగంగా కేటాయించదలిచారు.

బ్యాంకు లోగోతో యాప్

● ఇన్‌స్టాల్ చేయగానే రూ.9.7 లక్షలు హాం..ఫట్ ● ఓటీపీ రాకుండానే సొమ్ము గోవిందా
● ఆన్‌లైన్‌లో మోసంతో అమాయకుడి లబోదిబో ● పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఇటీవల స్మార్ట్‌ఫోన్ నుంచే ఆర్థిక లావాదేవీలు పెరిగిపోయాయి. దీనిని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్ళు రోజుకోరకంగా అమాయకులను మోసం చేస్తున్నారు. నకిలీ యాప్‌లు సృష్టించి బాంకు ఖాతాల నుంచి డబ్బును ఈజీగా దోచేస్తున్నారు. విజయనగర జిల్లా, హూవినహడగలి పట్టణంలో కెనరా బ్యాంకు ఖాతాదారుడి నుంచి సైబర్ నేరగాళ్లు నకిలీ యాప్‌ద్వారా ఏకంగా రూ 9.7లక్షలు దోచుకున్న ఘటన వెలుగు చూసింది. తాలూకా పరిధిలోని నందిహళ్ళి కంతి విరుపాక్షి రెండు రోజుల క్రితం భూమిని అమ్మగా వచ్చిన సొమ్మును బ్యాంకు ఖాతాలో జమ చేశారు. ఖరీదు దారులు మరింత సొమ్ము ఇవ్వాల్సి ఉంది. ఆదివారం విరూపాక్షికి కెనరా బ్యాంకు లోగోతో కూడిన యాప్ లింక్‌తో మెసేజ్ మొబైల్‌కు వచ్చింది. బ్యాంకు నుంచి వచ్చిన మెసేజ్‌గా భావించిన విరుపాక్షి... యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. అనంతరం 30 నిముషాల్లోనే బ్యాంకు ఖాతాలో ఉన్న రూ 9.7లక్షల రూపాయలు డ్రాచేసినట్లు మెసేజ్ రావడంతో అయోమయంలో పడ్డారు. సోమవార ఉదయం నగదు బదిలీ చేయాలని మొబైల్‌లో ఖాతా చూడగా, డబ్బులేదని బ్యాలెన్స్ చూపడం లేదని బ్యాంకు అధికారులు తెలపడంతో ఆయన కుంగిపోయారు. బాధితుడు విరుపాక్షి పోలీసు స్టేషన్‌కు వెళ్ళి ఫిర్యాదుచేయగా, పోలీసులు కేసును సైబర్ క్రైమ్ విభాగానికి బదిలీ చేశారు. పోలీసుల ఎదుట జరిగిన విషయం తెలిపాడు. బ్యాంకు ఖాతాలకు సైబర్ నేరగాళ్ళ నుండి రక్షణ లేకపోతే బ్యాంకులపై ఎలా విశ్వాసం వస్తుందని వాపోయాడు. సాధారణంగా డిజిటల్ వ్యహారంలో ఓటీపీ తప్పని సరి, అయితే ఓటీపీ లేకుండానే బ్యాంకు ఖాతా నుంచి డబ్బు డ్రా కావడం ఖాతాదారులను బెంబేలెత్తిస్తోంది.



ఇకపై పోస్టుల భర్తీకి
కన్నడలోనే పరీక్షలు

● రైల్వే శాఖ సహాయ మంత్రి సోమణ్ణ


రోజ్‌గార్ మేళాలో నియామకపత్రాలు అందజేస్తున్న కేంద్రమంత్రి సోమణ్ణ

బెంగళూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రైల్వేశాఖలో ఈ ఏడాది భర్తీ చేసే 60వేల పోస్టులకు సంబంధించి కన్నడలోనూ పరీక్షలు రాసే అవకాశం కల్పిస్తున్నట్లు రైల్వే శాఖ సహాయ మంత్రి సోమణ్ణ తెలిపారు. మైసూరు నగరంలోని అఖిల భారత వాక్, శ్రవణసంస్థ విజ్ఞానభవన్‌లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన దేశవ్యాప్తంగా 51వేలమంది అభ్యర్థులకు నియామక పత్రాల పంపిణీ మంగళవారం జరిగిందన్నారు. రోజ్‌గార్ మేళాలో ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా భాగస్వామ్యులయ్యారు. ఈ సందర్భంగా సోమణ్ణ మాట్లాడుతూ 2014 నుంచి 12 విడతల్లో ఉద్యోగమేళాల ద్వారా 14లక్షలమందికి నియామకాలు అందించామన్నారు. తద్వారా ప్రతిభావంతులకు అవకాశాలు లభించాయన్నారు. రైల్వేశాఖలో 2014 నుంచి ఇప్పటివరకు 5.2లక్షల ఉద్యోగులను నియమించామన్నారు. పోస్టల్‌శాఖలోనూ భారీగా నియామకాలు చేపట్టామన్నారు. కేంద్రప్రభుత్వం జన్‌ధన్‌తోపాటు సామాన్యులకు అనుకూలమైన పథకాలను తీసుకొచ్చిందన్నారు. వాక్ శ్రవణసంస్థకు 150 కోట్ల రూపాయల గ్రాంటు ఇచ్చి అభివృద్ధి చేసిందన్నారు. మైసూరు ఎంపీ యదువీర్ కృష్ణదత్త చామరాజ ఒడయార్ మాట్లాడుతూ పదేళ్లలో వికసిత భారత్‌కు ప్రధానమంత్రి నరేంద్రమోదీ శ్రీకారం చుట్టారన్నారు. 2047నాటికి అభివృద్ధి లక్ష్యాన్ని చేరుకోనుందన్నారు. కేంద్రప్రభుత్వానికి అనుబంధమైన శాఖల్లో నియామకాల ద్వారా ప్రతిభావంతులకు ఉద్యోగాలు లభిస్తున్నాయన్నారు. ఎమ్మెల్యే శ్రీవత్స, దక్షిణకర్ణాటక విభాగం పోస్టల్‌శాఖ డైరెక్టర్ సందేశ్ మహదేవప్ప, రైల్వేశాఖ డీఆర్ఎం శిల్పి అగర్వాల్, ఆయుష్ సంస్థ డైరెక్టర్ పుష్పవతి, పోస్ట్‌మాస్టర్ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ కాకుమా తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

మూడు వేల కోట్ల భూమిని ముట్టజెప్పే యత్నం..!



● ప్రైవేట్ వ్యక్తితో రెవెన్యూ అధికారి లాలూచీ
● లోకాయుక్తకు ఫిర్యాదు చేసిన కలెక్టర్
● మాజీ మంత్రి ఒత్తిడితోనే అంటున్న సిబ్బంది
● పంపకాల్లో తేడాతోనే బయట పడిందా..?

బళ్లారి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా మూడు వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తికి ధారాదత్తం చేయడానికి ప్రయత్నించాడో రెవెన్యూ అధికారి. నగర నడి బొడ్డున ఉన్న స్థలం, అదీ ఏకంగా 11.59 ఎకరాలు. మాజీ మంత్రి శ్రీరాములు, గాలి జనార్దన్‌రెడ్డి నివాసం ఉంటున్న హవంబావి సమీపంలో ఉన్న కాస్ట్లీ స్థలమది. సర్వే నబంర్ 348లో 11.59 ఎకరాల భూమి ఉంది. దీని విలువ ప్రస్తుతం మార్కెట్‌లో సరాసరి రూ. 3000 కోట్లకు పైమాటే. ఇంత విలువైన ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తికి అప్పగించేందుకు ఓ రెవెన్యూ అధికారి సిద్ధమయ్యారు. ఈ వ్యవహారంలో పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారాయని తెలుస్తోంది. దీన్ని ఓ ఉద్యోగి డీసీ దృష్టికి తీసుకెళ్లారు. రికార్డులు పరిశీలించిన ప్రస్తుత కలెక్టర్ తహసీల్దార్ పై లోకాయుక్తకు, రెవెన్యూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

బళ్లారి లోని హవ్వంబావి ఏరియాలోని సర్వేనంబర్ 348లో 11.59 ఎకరాలు భూమి ఉంది. ఈ భూమి రికార్డులను పరిశీస్తే బసవేశ్వర దేవాలయానికి చెందిన ఇనాం భూమి, దీన్ని 1982లో ఓ మహిళ పేరు మీద మార్చినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి 2020లో ఎన్ఎ కూడా చేశారు. అయితే రెవెన్యూ భూముల రికార్డులో ఇది ఈ ఇనాం భూమి కర్ణాటక ప్రభుత్వానికి చెందినట్లుగా రికార్డులున్నాయి. 2020లో ఇక్కడ తహసీల్దార్ గా పని చేసిన ఓ అధికారి అప్పట్లో ఓ మంత్రి ఒత్తిడితోనే ఇదంతా నడిపారని సమాచారం. అప్పట్లో సర్కాను పేరిట ఉన్న రికార్డులను పార్వతమ్మ అనే మహిళ పేరుతో మార్చేందుకు ప్రయత్నించారని తెలుస్తోంది. అయితే అన్నీ కుదిరాక మధ్యవర్తిగా ఉండే వ్యక్తి డబ్బులు ఇవ్వలేని కారణంగా ఆ భూమి రికార్డులనే దాచిపెట్టినట్లు సమాచారం. సర్కారు భూమిని ప్రైవేట్ వ్యక్తికి అప్పగించే ప్రయత్నాన్ని కనిపెట్టిన కలెక్టర్ లోకాయుక్తకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే 1982లోనే ఈ భూమి తన పేరుతో ఉందని, 2020లో ఎన్ఎ కూడా ఇచ్చారని పార్వతమ్మ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ భూమికి సంబంధించి రికార్డులను దాచిపెట్టి తనకు ఇవ్వడం లేదని ఆమె ఆరోపిస్తోంది. మొత్తం మీద ఈ భూమి వ్యవహారం బహిర్గతం కావడంతో బళ్లారిలో భూమాఫియా రాకెట్ ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

పునీత్‌ను స్మరించుకున్న అభిమానులు


పునీత్‌కు నివాళి అర్పిస్తున్న భార్య అశ్విని తదితరులు

బెంగళూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కన్నడ మేటి నటుడు పునీత్‌రాజ్‌కుమార్ మూడో వర్థంతిని పురస్కరించుకుని అభిమానులు రాష్ట్ర వ్యాప్తంగా నివాళి అర్పించారు. కంఠీరవస్టూడియోలోని సమాధివద్ద కుటుంబ సభ్యులు పూజలు జరిపారు. పునీత్ భార్య అశ్విని, కుమార్తెలు, రాఘవేంద్రరాజ్ కుమార్, వినయ్‌తోపాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అభిమానులు పెద్ద ఎత్తున సమాధివద్దకు తరలి వచ్చారు. కాగా రాష్ట్రమంతటా పునీత్ అభిమానులు ప్రాంతాలవారీగా పునీత్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలు చల్లి నివాళి అర్పించారు.

గస్తీ పోలీసు అధికారిపై దాడి

బంగారపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాత్రివేళ గస్తీలో ఉన్న మహిళా ఏఎస్సైపై దుండగులు చాకు దాడి చేసి హత్యకు ప్రయత్నించడం కలకలం రేపింది. బంగారపేట పట్టణంలో సోమవారం రాత్రి విధి నిర్వహణలో ఉన్న మహిళా ఏఎస్సై ఫరీదా భానుపై జార్ఖండ్‌కు చెందిన అజయ్‌సింగ్ అనే వ్యక్తి చాకు విసిరాడు. ఇతడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. పట్టణంలోని జూనియర్ కళాశాల సమీపంలో హోంగార్డ్‌తో కలసి బైక్‌పై రాత్రిగస్తీలో ఏఎస్సై ఫరీదాభాను సంచరిస్తున్నారు. గంజాయి మత్తులో ఉన్న అజయ్‌సింగ్ బైక్‌ను అడ్డుకోవడంతో ఆమెపై చాకు విసిరాడు. ఏఎస్సై చేతులు అడ్డు పెట్టుకోవడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. అప్రమత్తమైన హోంగార్డు దుండగుడిని పట్టుకోవడంతో ప్రాణాలతో బయటపడినట్లు ఫరీదాభాను వెల్లడించారు. ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు. ఘటనపై డీఎస్పీ ఆరా తీస్తున్నారు.


చికిత్స పొందుతున్న ఏఎస్సై

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

హోమీ జె బాబా (జయంతి)



భారతదేశ న్యూక్లియర్ పితా మహగా పేరొందిన హోమీ జహంగీర్ బాబా 1909 అక్టోబరు 30న ముంబైలో జన్మించారు. భాభా అటామిక్ రీసెర్చ్ సెంటర్ సంస్థాపకులు, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్‌లో ఫిజిక్స్ ప్రొఫెసర్‌గానే కాక వ్యవస్థాపక డైరెక్టర్‌గాను వ్యవహరించారు. ఫిజిక్స్‌లో నోబెల్ ప్రైజ్‌కు నామినేట్ అయ్యారు. ఎలక్ట్రానిక్స్, స్పేస్ సైన్స్, రేడియో ఆస్ట్రానమీ, మైక్రోబయాలజీలలో ఎన్నో పరిశోధనలు చేశారు. ఆడమ్స్ ప్రైజ్, 'పద్మభూషణ్' పురస్కారం, రాయల్ సొసైటీ ఫెలోషిప్ అందుకున్నారు. 1966 జనవరి 24న కన్నుమూశారు. ముంబైలో ఏర్పాటైన అటామిక్ ఎనర్జీ సెంటర్‌కు ఆయన గౌరవార్థం భాభా అటామిక్ రీసెర్చ్ సెంటర్‌గా పేరు మార్చారు. ఆయన పేరిట ప్రత్యేక పోస్టల్‌స్టాంప్ విడుదల చేశారు.

డియెగో మారడోనా (జయంతి)



అర్జెంటీనా దేశ ఫుట్‌బాల్ క్రీడాకారుడు డియెగో మారడోనా 1960 అక్టోబరు 30న జన్మించారు. 'ఫిఫా ప్లేయర్ ఆఫ్ ది ట్వంటీయెత్ సెంచరీ' విజేత. గొప్ప ఫుట్‌బాల్ క్రీడాకారులలో ఒకరిగా నిలిచారు. నాలుగు ఫిఫా వరల్డ్‌కప్ పోటీల్లో పాల్గొన్నారు. ఫ్రీ కిక్ స్పెషలిస్ట్‌గా రాణించి తన కెరీర్‌లో 359 గోల్స్‌తో 'గోల్డెన్ బాయ్'గా అభిమానులచే పిలవబడ్డారు. అనేక జట్లకు కోచ్‌లుగా వ్యవహరించారు. 2020 నవంబరు 25న కన్నుమూశారు. అర్జెంటీనాలో 'ఐకాన్' గా నిలిచారు.

అరుణ సాయిరామ్ (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత అరుణ సాయిరామ్ 1952 అక్టోబరు 30న ముంబైలో జన్మించారు. శాస్త్రీయ సంగీత గాయనంలో రాణించి మ్యూజిక్ అంబాసిడర్ ఆఫ్ ఇండియాగా గుర్తింపు పొందారు. కర్ణాటక సంగీతశైలిలో నిష్ణాతులు. రాష్ట్రపతి భవన్, వీర్‌భూమి వేదికగాను, ఇజ్రాయెల్, జెరూసలెం ఫెస్టివల్స్‌తోపాటు లండన్‌లోని బీబీసీ ప్రామ్స్ వేదికగా కచేరీలు ఇచ్చిన తొలి కర్ణాటక సంగీత కళాకారిణి కావడం విశేషం. 2022 వరకు సంగీత నాటక అకాడమీ వైస్ ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించారు. సంగీత కళానిధి, కళైమామణి, సంగీత చూడామణి, భారతి త్యాగరాజ సమ్మాన్ అవార్డు, అర్ష కళాభూషణ్ తదితర పురస్కారాలు పొందారు.

బిహార్‌లో పెట్టుబడులకు రండి

బెంగళూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): బిహార్‌లో పరిశ్రమల ఏర్పాటుకు రావాలని పిలుపునిచ్చారు. బిహార్ బిజినెస్ కనెక్ట్ 2024 గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్ సన్నాహకంలో భాగంగా బెంగళూరులో మంగళవారం ప్రత్యేక సమావేశం జరిపారు. బిహార్‌కు చెందిన పరిశ్రమలశాఖ కార్యదర్శి బందనా ప్రేయసి మాట్లాడుతూ బిహార్‌లో ఐటీ, జౌళి, ఆహార సంస్కరణతోపాటు వివిధ విభాగాలలో పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలంగా ఉందన్నారు. ఇటీవల బిహార్‌లో మార్పులు వస్తున్నాయని, పరిశ్రమలు పెరుగతున్నాయన్నారు. పెట్టుబడిదారులకు వ్యాపారస్నేహి వాతావరణాన్ని పెంపొందింపచేస్తున్నామన్నారు. ఐబీఎం గ్రాఫెన్ సెమి కండక్టర్ సూపర్ సేవా గ్లోబల్ సర్వీస్, హంగర్‌బాక్స్ లాంటి కంపెనీలు బీహార్‌లో పరిశ్రమలకు ముందుకొచ్చినట్టు తెలిపారు.



సమావేశంలో బిహార్‌శాఖ అధికారి బందనా ప్రేయసి తదితరులు

హరీశ్‌గౌడ తీరుపై ఫిర్యాదుకు సిద్ధం



మీడియాతో జేడీఎస్ నాయకుడు వసంత్ తదితరులు

▸▸ జేడీఎస్ నాయకుడు వసంత్

దొడ్డబళ్ళాపుర, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని జేడీఎస్ ప్రముఖుడు హరీశ్‌గౌడ బీజేపీ-జేడీఎస్ మైత్రి ధర్మానికి వ్యతిరేకంగా నడుచుకుంటున్నారని దీంతో కార్యకర్తలలో గందరగోళం నెలకొందని దీనిపై హైకమాండ్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు జేడీఎస్ నాయకుడు వసంత్ ఆక్రోశం వ్యక్తం చేశారు. దొడ్డతుమకూరు గ్రామ పంచా యతీ పరిధిలోని వీఎస్ఎస్ఎన్ ఎన్నికల గురించి మంగళవారం ఏర్పాటైన సమావేశంలో మీడి యాతో మాట్లాడారు. ఈనెల 26న వ్యవసాయ సహకార సంఘం (వీఎస్ఎస్ఎన్) కో- ఆపరేటివ్ ఎన్నికల్లో మైత్రి. ధర్మం పాటించాలని జేడీఎస్ పార్టీ హైకమాండ్ స్థానిక నాయకులకు సూచించిందన్నారు. అయితే జేడీఎస్‌లు రెండు గ్రూప్‌లుగా ఏర్పడి ఒకటి కాంగ్రెస్‌కు, మరొకటి బీజేపీకి సహకారం అందిస్తోందన్నారు. ఈ సందర్భంగా తాలూకా జేడీఎస్ నాయకుడు హరీశ్‌గౌడ మాట్లాడుతూ జేడీఎస్, కాంగ్రెస్‌తో జతకట్టి ముందుకెళుతోందన్నారు. ఇది పార్టీ హైకమాండ్ సూచనను ఉల్లంఘించినట్టు అయ్యిందన్నారు. హరీశ్‌గౌడ వ్యాఖ్యలు కార్యకర్తలలో తప్పుడు సందేశం ఇచ్చినట్టు అయ్యిందన్నారు. నగర సభ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికల్లో వేరే సమావేశంలో ఉన్నారని, సాయంత్రం ఎన్డీయేకు అనుకూల నినాదాలు చేశారన్నారు. మీ మనఃస్థితి ఎలా ఉందో తెలుసా..? దొడ్డబళ్ళాపురకు మీ సేవలు ఏంటని ప్రశ్నించారు. ఆలయానికి రాళ్లు ఇచ్చారా..? నీరు ఇచ్చారా..? ఏ గ్రామంలోనైనా బోరు వేయించారా..? అంటూ ప్రశ్నలు సంధించారు. కనీసం గ్రామ పంచాయతీ ప్రజాప్రతినిధిగా ఎన్నికయ్యారా..? మీ అంతట మీరే నాయకులని ప్రకటించుకుని గందరగోళం కల్పించడం సరికాదని హరీశ్‌గౌడ తీరుపై మండిపడ్డారు. దొడ్డతుమకూరు గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు మంజునాథ్ మాట్లాడుతూ వీఎస్ఎస్ఎన్ ఎన్నికలు ఏకగ్రీవం కావాల్సి ఉండేదని అయితే చుంచేగౌడ, హరీశ్‌గౌడ వల్ల పోలింగ్‌కు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కాగా ఎమ్మెల్యే పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని మండిపడ్డారు. కాగా కాంగ్రెస్‌కు వెళ్లదలచుకుంటే పోవాలన్నారు. అనవసరంగా ఇబ్బంది కలిగించరాదన్నారు. మీడియా సమావేశంలో గ్రామ ప్రముఖులు ప్రకాశ్, మంజునాథ్, నాగరాజు, రాజు సహా జేడీఎస్, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐక్యతా పరుగులో ఉత్సాహంగా బీజేపీ నేతలు

బెంగళూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఉక్కుమనిషిగా పేరొంది తొలి హోం శాఖ మంత్రిగా వ్యవహరించిన భారతరత్న సర్దార్‌వల్లభాయ్‌పటేల్ జయంతిని పురస్కరించుకుని నగరంలో ఐక్యతా పరుగు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, ప్రతిపక్షనేత అశోక్ తదితరులు పాల్గొన్నారు. కంఠీరవ స్టేడియం నుంచి మంగళవారం ఉదయం ప్రారంభమైంది. పార్టీ అధ్యక్షుడు విజయేంద్ర మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపుమేరకు రన్ ఫర్ యూనిటీ (ఐక్యతా పరుగు) జరిపామన్నారు. దీపావళి పండుగ నేపథ్యంలో ముందస్తుగా కార్యక్రమం నిర్వహించామన్నారు. ఎమ్మెల్యేలు కృష్ణప్ప, రవిసుబ్రమణ్య, రఘు, పార్టీ ప్రధాన కార్య దర్శులు రాజీవ్, నందీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పరుగులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, ప్రతిపక్షనేత అశోక్ తదితరులు

మింటో ఆసుపత్రిలో ప్రత్యేక విభాగం



మింటోలో అత్యవసర విభాగం ఏర్పాటు

బెంగళూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బాణాసంచా కాల్చేవేళ జాగ్రత్తలు పాటించాలని మింటో కంటి ఆసుపత్రి డైరెక్టర్ నాగరాజ్ సూచించారు. నగరంలోని మింటో ఆసుపత్రిలో దీపావళి పండుగ కోసం ప్రత్యేకమైన పడకలను ఏర్పాటు చేసినట్లు మీడియాకు తెలిపారు. 30 పడకలతో ప్రత్యేక విభాగం సిద్ధం చేశామ న్నారు. నిరంతరంగా వైద్యసిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. పొగతోపాటు పేలుడువల్ల కళ్లకు దెబ్బతగిలితే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని, సొంతవైద్యం చేసుకోరాదన్నారు. ఏటా పదుల సంఖ్యలో ప్రమాదాలతో కళ్లు కోల్పోయినవారు ఉన్నార న్నారు. జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కాగా నారాయణ నేత్రాలయ ఆసు పత్రులు రాజాజినగర్, బొమ్మసంద్ర, ఇందిరానగర్, బన్నేరుఘట్ట రోడ్డులలో అత్య వసర విభాగాలను ఏర్పాటు చేశామన్నారు. దీపావళి వేళ ప్రమాదాలకోసం ప్రత్యేకంగా వార్డును, సిబ్బందిని కేటాయించామన్నారు.

చురుగ్గా బీజేపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదులో రవికుమార్ తదితరులు

విజయపుర, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు గ్రామీణ జిల్లా దేవనహళ్ళి తాలూకాలోని విజయపురలో బీజేపీ సభ్యత్వ నమోదు చురుగ్గా సాగుతోంది. పట్టణంలోని అంకతట్టి నంజుండప్ప సర్కిల్‌లో ఏర్పాటైన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి హెచ్‌ఎం రవికుమార్ మాట్లాడుతూ ప్రపంచంలో అత్యధిక సభ్యులు కల్గిన పార్టీ బీజేపీ నిలిచిందన్నారు. ఇందుకు కార్యకర్తలే కీలకమన్నారు. బెంగళూరు గ్రామీణ జిల్లాలో రెండున్నర లక్షల సభ్యత్వం తమ లక్ష్యంగా ఉందన్నారు. ఇప్పటికే దొడ్డబళ్ళాపుర తాలూకాలో 40వేలు, దేవనహళ్ళి తాలూకాలో 14వేలు, నెలమంగలలో 14వేలు, హొసకోటెలో 8వేలు నమోదైందన్నారు. దీంతో 25శాతం లక్ష్యాన్ని అందుకున్నామని నవంబరు 5కు పూర్తి కానుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా శాసనసభ ఎన్నికల్లో కూడా బీజేపీ భారీ విజయం సాధిస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. జిల్లా సోషల్‌మీడియా సంచాలకులు సాగర్, సహ సంచాలకులు వాణి నందకుమార్, తాలూకా మహిళా ప్రధాన కార్యదర్శి వీణా తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

అనంతపురం క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : నగరంలో పీడీఎస్ బియ్యం తరలిస్తుండగా వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. నవోదయకాలనీకి చెందిన సోమనాథ్, టీవీ టవర్‌కు చెందిన జయపాల్‌రెడ్డి మంగళవారం మున్నానగర్‌లో వాహనంలో తీసుకెళ్తుండగా వన్‌టౌన్ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి ఏడు బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

మాత్రలు మింగి యువకుడి మృతి

అనంతపురం క్రైం: ఫిట్స్‌తో బాధపడుతున్న ఓ యువకుడు ఎక్కువ మొతా దులో మాత్రలు వేసుకుని మృతి చెందాడు. స్థానిక భాగ్యనగర్ ఏడో క్రాస్‌లో నివాసముంటున్న దుర్గేష్(20కు చిన్నప్పటి నుంచి ఫిట్స్ వచ్చేవి. బెంగుళూరు తదితర ప్రాంతాల్లో చూపించినా నయం కాలేదు. రెండు రోజుల క్రితం ఓ డాక్టర్ తో చూపించుకుని కొన్ని మాత్రలు తీసుకున్నాడు. మంగళవారం దుర్గేష్ ఎక్కువ మాత్రలు వేసుకున్నాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని ఆసుపత్రికి తరలించ గా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆ యువకుడు ఆత్మహత్యా యత్నం చేసుకున్నాడా...? లేక పొరపాటున ఎక్కువ మొతాదులో తీసుకున్నాడా..? అనేది తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాత్రి అదృశ్యం.. ఉదయం మృతి

అనంతపురం క్రైం: ఓ మతిస్థిమితం లేని బాలుడు రాత్రి అదృశ్యమయ్యాడు ఉదయం చూసేసరికి ఇనుప చువ్వ గుచ్చుకుని మృతి చెందాడు. నగరంలోని గుల్జార్‌పేటకు చెందిన మహబూబ్‌బాషా కుమారుడు సాదిక్(17)కు మతిస్థిమి తం సరిగా లేదు. వైద్యులతో చికిత్స పొందుతున్నాడు. సోమవారం రాత్రి 10.30 గంటలకు ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. మంగళవారం ఉదయం పక్క ఇంట్లో మేడపై ఉన్న సిమెంట్ పిల్లర్‌కున్న ఇనుప చువ్వ కడుపులో గుచ్చుకుని ఉన్న సాదిక్ కనిపించాడు. ఆ ఇంట్లో చెప్పుల దుకాణం నిర్వహిస్తున్న వారు షాపు తెరిచి పైకి వెళ్లగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. వారు తల్లిదండ్రులకు తెలియజేశారు. టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు

వ్యభిచార గృహంపై దాడి

అనంతపురం క్రైం: నాలుగో పట్టణ పోలీసులు నగరంలోని ఓ వ్యభిచార గృహంపై దాడులు నిర్వహించారు. ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తుండగా ఓ మహిళతో పాటు మరో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అన్నదాతకు అన్యాయం

అనంతపురం అర్బన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో అనంతపురం జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోయినా.. సాంకేతిక కారణాలతో మరింత అన్యాయం జరుగుతోంది. అవసరమైన సమయంలో వ ర్షం కురవకపోయినా.. మొత్తంగా కురిసిన వర్షాన్ని పరిగణనలోకి తీసుకుని.. కరువు మం డలాలను ఎంపిక చేశారు. దీంతో కరువు జా బితాలో కేవలం ఏడు మండలాలకు చోటు ద క్కింది. నార్పల, అనంతపురం, విడపనకల్లు, యాడికి, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, రా ప్తాడు మండలాలను మాత్రమే కరువు మం డలాలుగా ప్రకటిస్తూ ప్రభుత్వం మంగళవా రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. జిల్లాలోని అన్ని మండలాలలో ప్రధాన పంట వే రుశనగ సహా అన్ని పంటలూ ఖరీఫ్‌లో దెబ్బతిన్నాయి. రైతులు తీవ్రంగా నష్టపోయారు. కానీ ఏడు మండలాలలో కరువు ఉన్నట్లు ప్రభుత్వం ప్రకటించడంలో మిగిలిన మండలాల రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

భారీగా పంటనష్టం

● జిల్లాలో ప్రధాన పంట వేరుశనగ. తీవ్ర వర్షాభావవంతో పంట దెబ్బతింది. దీంతో చాలామంది రైతులు దున్నేశారు. ప్రత్యామ్నాయ పంట వేద్దామని చూసినా.. వర్షం కురవలేదు. కొన్నిచోట్ల అరకొరగా దిగుబడి వచ్చినా.. కోత సమయంలో వర్షం కురిసి దిగుబడులు తడిసిపోయాయి. వేరుశనగ కట్టె కుళ్లిపోయింది. వేరుశనగకు కీలకమైన పూత, ఊడ, పిందె దశలో చుక్క వాన లేదు. సెప్టెంబరు ఊడలు దిగే సమయానికి వర్షం వచ్చి ఉంటే మంచి దిగుబడులు వచ్చేవి. కానీ వానలు లేక నష్టపోయామని రైతులు ఆవేదన చెందుతున్నారు. పలు ప్రాంతాల్లో వేరుశనగ పైకి పచ్చగా ఉన్నా.. దిగుబడులు అంతంత మాత్రంగానే వచ్చాయి.

వెంటాడిన వర్షాభావం

జూన్ మొదటి రెండు వారాలు, ఆగస్టు మూడో వారంలో మాత్రమే జిల్లాలో బాగా వర్షాలు కురిశాయి. జూన్ సాధారణ వర్షపాతం 61 మి.మీ. కాగా.. ఆ నెల తొలి పక్షం రోజుల్లో ఏకంగా 143 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిగిలిన పక్షం రోజుల్లో కేవలం 4.7 మి.మీ. వర్షపాతం నమోదైంది. జూలైలో వర్షాభావం వెంటాడింది. ఆగస్టులో పక్షం రోజులపాటు సరైన వర్షం పడలేదు. 14 నుంచి 22వ తేదీ మధ్య భారీ వర్షాలు పడ్డాయి. సెప్టెంబరు మొదటి వారంలో మోస్తరు వర్షాలు పడ్డాయి. జూన్ 15 నుంచి ఆగస్టు 15 దాకా రెండు నెలల్లో కొన్ని మండలాల్లో 50 రోజులపాటు చినుకు జాడే లేదు. ఖరీఫ్ సీజన్ మొత్తం వర్షపాతాన్ని పరిగణనలోకి తీసుకోవడంతో సాంకేతికంగా కరువు కనిపించడం లేదు. మొత్తంగా ఖరీఫ్ సాధారణ వర్షపాతం కంటే ఎక్కువగానే కురిసిందన్న సాకుతో కరువు మండలాలను భారీగా కుదించారు. జిల్లాలో 31 మండలాలు ఉండగా.. కేవలం ఏడింటికి జాబితాలో చోటు కల్పించారు. మిగలిన 24 మండలాల రైతులకు మొండిచేయి చూపారు.



వైభవం.. వెండిరథ ప్రాకారోత్సవం..

కదిరి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వసంత వల్లభుడి వెండిరథ ప్రాకారోత్సవం వైభవంగా నిర్వహించారు. వెండిరథంలో కొలువుదీరిన స్వామివారిని సుగంధ పుష్పాలు, కదిరి మల్లెలు, తులసీమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆస్థాన పూజలు నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వెండిరథంపై శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారు

ఉప్పొంగిన గంగ



చేతిపంపు నుంచి వస్తున్న నీరు

మడకశిర మండలంలో భూగర్భ జలమట్టం చాలా దారుణంగా ఉంటుంది. వందల అడుగులు తవ్వినా నీటిచుక్క దొరకదు. మెళవాయి గ్రామంలోని బీసీ కాలనీలో ఏళ్ల క్రితం చేతిపంపు ఏర్పాటు చేశారు. భూగర్భ జలాలు అడుగంటిపోవడం, చేతిపంపు నీరు రాకపోవడంతో నిరుపయోగంగా పడి ఉంది. అలాంటి చేతిపంపు నుంచి గంగ ఉప్పొంగడంతో అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. చేతిపంపు నుంచి నీరు పొంగి మంగళవారం బయటకు వస్తోంది. మహిళలు గంగపూజ చేశారు. గ్రామస్థులు సంతోషం వ్యక్తంచేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు భూగర్భ జలమట్టం పెరిగడంతో చేతిపంపు నీరు వస్తోందని గ్రామస్థులు తెలిపారు.

- మడకశిర రూరల్ (ఆంధ్రజ్యోతి)

ఉద్యోగుల సంఘానికి

ముగ్గురు డైరెక్టర్ల ఎన్నిక



నూతన డైరెక్టర్లకు సన్మానం

శిడ్లఘట్ట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రానున్న ఐదేళ్ల అవధికి తాలూకాల వారీగా శాఖలకు డైరెక్టర్‌ల స్థానాలకు 30మంది ఏకగ్రీవంగా కాగా మరో మూడు స్థానాలకు 8మంది పోటీ పడ్డారు. సోమవారం పట్టణంలోని జూనియర్ కళాశాలలో పోలింగ్ జరిగింది. తాలూకాలోని వివిధ శాఖలనుంచి మొత్తం 23 విభాగాలుగా విభజించారు. 33 డైరెక్టర్‌ల స్థానాలకు 30మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యాయుల విభాగం నుంచి ముగ్గురు పోటీ పడగా 368 ఓట్లతో మేలూరు మంజునాథ్ , 318 ఓట్లతో కెంపేగౌడ, 306 ఓట్లతో నరసింహారెడ్డి గెలుపొందారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాలూకా అధ్యక్షుడు సుబ్బారెడ్డి మాట్లాడుతూ తాము సిండికేట్‌గా ఏర్పడి ముగ్గురు అభ్యర్థులను బరిలోకి దించగా ముగ్గురూ గెలుపొందారన్నారు. సామూహిక నాయకత్వంతో విజయం సాధ్యమైందన్నారు. తాలూకా హైస్కూల్ స్కూల్ అసిస్టెంట్‌ల సంఘం అధ్యక్షుడు ఎల్‌వి వెంకటరెడ్డి, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు బీఆర్ నారాయణస్వామి, ప్రధాన కార్యదర్శి హెచ్‌ఎస్ రుద్రేశమూర్తి, ఎన్‌పిఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గజేంద్ర, గౌరవాధ్యక్షుడు ఏవీ వెంకటనరసప్ప తదితరులు పాల్గొన్నారు.

కాపల్లిలో గ్రామదేవతల జాతర



ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

చింతామణి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని మురగమల్లా హోబళి కాపల్లి గ్రామంలో గ్రామదేవతలు గంగమ్మదేవి, చౌడేశ్వరి దేవిల జాతర ఘనంగా జరిగింది. కొంతమంది భక్తులు దీపాలతో ఉత్సవంలో పాల్గొన్నారు. రెండు రోజులపాటు జరిగిన ఉత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం జాతర నిర్వహిస్తున్న రీతిలోనే ఈసారి కూడా నిర్వహించినట్టు నిర్వాహకులు తెలిపారు.

పాలసీబజార్ ద్వారా సరళీకృత సేవలు

బెంగళూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పాలసీబజార్ ద్వారా అన్నివర్గాల ప్రజలకు బీమా సేవలను సరళీకృతం చేయదలిచామని సంస్థ పెట్టుబడిదారుల విభాగం ముఖ్యులు వివేక్‌జైన్ అభిప్రాయపడ్డారు. నగరంలో పాలసీబజార్ కార్యాలయాన్ని లాంఛనంగా ప్రారంభించారు. దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ విధానంతో పాలసీబజార్ బీమాసేవలను కొనసాగిస్తోందన్నారు. అయితే ఎక్కువ మంది వినియోగదారులు ఆఫ్‌లైన్ సేవలను కోరుతున్నారని అందుకే బెంగళూరులో 200మంది టీమ్‌తో జాతీయ, అంతర్జాతీయ సేవలు కొనసాగించదలిచామన్నారు. ఫిన్‌టెక్ జాయింట్‌గ్రూప్ సీఈఓ సర్బీర్‌సింగ్ మాట్లాడుతూ బీమా పాలసీలను ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ రెండు విధానాల ద్వారాను అందించేందుకు కార్యాలయాన్ని ఏర్పాటు చేశామన్నారు.

పర్యావరణ కోసం భాగస్వామ్యులు కావాలి

బెంగళూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో అన్నివర్గాల ప్రజలు భాగస్వామ్యులు కావాలని టీమ్ వెబర్ శాండ్‌విక్ కలెక్టివ్ (టీడబ్ల్యుఎస్‌సి) నిర్వాహకులు అభిప్రాయపడ్డారు. నగరంలోని నీలసంద్ర ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటారు. గ్రో బిలియన్ ట్రీస్ లో భాగంగా మొక్కలు నాటారు. పాఠశాలలు, విద్యాసంస్థలతోపాటు అవకాశం ఉన్న ప్రతిచోటా మొక్కలు నాటాలని సూచించారు. విద్యార్థులతో కలసి శ్రమదానం చేశారు.

నిత్యావసర కిట్‌ల పంపిణీ



కిట్‌లు అందచేస్తున్న కుప్పి మంజునాథ్

మహదేవపుర, అక్టో బరు 29 (ఆంధ్ర జ్యోతి): దీపావళి పండుగను పురస్కరిం చు కుని వర్తూరులోని పేద కుటుంబాలకు నిత్యావసర కిట్‌లను స్వాభిమాని వర్గం అధ్యక్షుడు కుప్పి మంజునాథ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంజునాథ మాట్లాడుతూ పేదలను ఆదుకోవడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని అభిప్రాయపడ్డారు. దీపావళి పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలన్నారు. పండుగకోసం తనవంతుగా నిత్యావసరాలు అందచేస్తున్నట్టు తెలిపారు. బాల్యంలో తాను ఎంతో పేదరికం చవిచూశానని గుర్తు చేసుకున్నారు. అందుకే పేదలకు తనవంతు చేయూత ఇస్తున్నట్టు తెలిపారు. స్వాభిమాని బళగ ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో సమాజసేవకుడు బీకే రాజారెడ్డి, ప్రముఖులు వర్తూరు సురేశ్, జైశ్రీరామ్ సేవా సమితి సంఘం పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయకుంటలో వ్యక్తి మృతదేహం

శిడ్లఘట్ట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తాలూకా లోని అబ్లూడు గ్రామపంచాయతీ పరిధిలోని సాదలి గ్రామ సమీపంలోని ఒక రోడ్డుపక్కన నారా యణప్పకు చెందిన తోటలో వ్యవసాయకుంటలో ఒక వ్యక్తి మృతదేహం లభించింది. నారాయణస్వామి (31)గా గుర్తించారు. ఇతను జయంతి గ్రామానికి చెందిన మానసిక సమస్యలు ఎదుర్కొన్నట్టు గుర్తించారు. ఇప్పటివరకు రెండుసార్లు ఆత్మహత్యకు ప్రయత్నించినట్టు తెలుస్తోంది. సోమవారం ఉదయం కుటుంబ కలహాలతో ఇతను తోటవైపు వెళ్లి కుంటలో పడి మృతి చెందినట్టు తెలుస్తోంది. సమా చారం అందుకున్న దిబ్బూరహళ్ళి ఎస్సై వెంకటరోణ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శిడ్లఘట్ట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.